TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 230 గురువారం, జులై 09, 2026 పేజీలు :8 వెల.1/-




## 'కొత్త కేటాయింపు కాదు'.. తాడిచర్ల కోల్ బ్లాక్ కేటాయింపుపై భట్టి క్లారిటీ



హైదరాబాద్, జులై 8: సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటి అని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్(ఓఓఃఖీ) యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు.కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

## వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి

### ఘనంగా నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అయనకు ఘనంగా నివాళులర్పించారు. రైతు సంక్షేమం, ఉచిత విద్యుత్, ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా ప్రోత్సాహం, సామాజిక న్యాయం వంటి రంగాల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రజలనే తన కుటుంబంగా భావించి, వారి సంక్షేమమే పరమావధిగా జీవితాంతం కృషి చేసిన మహోన్నత ప్రజానాయకుడిగా ఆయనను కొనియాడారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారి ఆశయాలు, ప్రజాసేవ పట్ల ఆయన అంకితభావం, మానవతా దృక్పథం నేటికీ కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు.

## నేటి కవిత

అంశం : స్వేచ్ఛా కవిత
శీర్షిక;వెన్నెల విభావరి
బిరుదు రాజు ప్రమీల రాణి
స, సంఖ్య ;38
కవిత సంఖ్య : 488

తారలన్నీ దిగివచ్చి నింగి వాకిట ముగ్గేసెను
వెండి మబ్బుల తేరు మీద జాబిలమ్మ ఊరేగెను
కలువ కన్నులు విచ్చుకుని చందమామను చూసెను
కలల లోకపు తలుపులన్నీ వెన్నెల విభావరి తీసెను ..

కొమ్మ రెమ్మల సందుల్లోన వెన్నెలమ్మ పాకెను
కోకిలమ్మల గొంతుల్లోన మౌనమేదో ఊగెను
కొలను నీటికి అద్దం కట్టి నింగి నవ్వులు చిందెను
కొండలన్నీ కరిగిపోయి కాంతి వాగై పారెను..

మల్లె తోటకు పరిమళాల వలపు గాలే సోకెను
మగువ చెంపకు చిరునవ్వుల చందనాలే పూసెను
మనసు గదికి జ్ఞాపకాల పందిరేసి వేచెను
మాయ చేసే ఈ రాతిరి మనసునే దోచెను..

నదికి నిండుగ పున్నమిచ్చి నగలు తొడిగే నేలమ్మ
నడుము ఒంపుల సవ్వడిలో నాట్యమాడే గాలమ్మ
నిదుర కన్నుల కలల రాణి కథలు చెప్పే వేళమ్మ
నిశి వధూటికి ముద్దిచ్చే వెన్నెలమ్మ జాబిలమ్మ ..

చీకటంటే భయములేదు చంద్రుడున్నాడని
చింతలన్నీ కరిగిపోతే చిత్తమంతా పున్నమి
చేదు బాధలు మాయమయ్యే మంత్రమిదే కదమ్మ
చంద్రకాంతపు స్నానమాడు విభావరి వెన్నెలమ్మ...

కాలమంతా ఆగిపోయి కావ్యమయ్యే వేళిది
కనుల ముందు కలల ప్రపంచం కదలి వచ్చే రేయిది
కన్నె మనసుకు రంగులద్దే వర్ణమాలే ఈ సిరి
కవిత లల్లే నా గుండెకు ప్రాణమిచ్చే విభావరి..

ఓ విభావరి! ఓ వెన్నెలా!
ఓపికతో నా బాధలన్నీ కడిగేయవే
ఓ వెలుగులా! ఓ కాంతిరేఖా!
ఓదార్పుతో నా గుండెనిండా నిండిపోవే ..
---
స్వీయ రచన

## ప్ర రా బి నేటిమాట..

దేవుడు నీకు కష్టాలను ఇచ్చేది నిన్ను బాధ పెట్టడానికి కాదు... ఎంతమంది నీతో నిజాయితీగా ఉన్నారు... ఎంతమంది నటిస్తున్నారనేది నీకు తెలియజేయడానికి మాత్రమే
ఒక రోజులో జీవితం మారిపోదు. కానీ, రోజూ చేసే చిన్న చిన్న ప్రయత్నాలు, మంచి అలవాట్లు మొత్తం జీవితాన్నే మార్చేస్తాయి

- ప్రమీల రాణి బి

# తెలంగాణలో ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్, ఆయిల్ పామ్ సాగు విస్తరణ

## సీఎం రేవంత్ తో గోద్రేజ్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్ : తెలంగాణలో ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్, ఆయిల్ పామ్ సాగు విస్తరణ తదితర అంశాలపై గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తో చర్చించారు. రాష్ట్రంలో మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు నివేదికను అందించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి తో గోద్రేజ్ గ్రూపు సంస్థల కార్పొరేట్ అఫేర్స్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, ఆగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగత నియోగి భేటీ అయ్యారు.

ఖమ్మం జిల్లాలో ? 300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ఉపాధి కల్పించనున్నట్టు ప్రతినిధులు వివరించారు. ఇందులో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, పరిశోధన ? అభివృద్ధి కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది.

సీడ్ గార్డెన్ విస్తరణ కోసం అదనంగా మరో 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, ప్రాసెసింగ్ యూనిట్ కోసం రాహదారిని విస్తరించాలని ముఖ్యమంత్రి ని కోరారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని ఆదేశించారు.



# గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికి శాశ్వత గృహం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

వనపర్తి పేదవాడికి అండగా ఉంటారని, పేదల అభ్యున్నతికి అంకిత భావంతో పాటు పడతారని రాష్ట్ర ప్రజలు నమ్మి ఈ ప్రభుత్వాన్ని బలపరిచిందని, ప్రజల నమ్మకాన్ని తల తాకట్టు పెట్టీ అయిన ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని, తద్వారా పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.×బిబుధవారం వనపర్తి జిల్లాలో పర్యటించి సహచర మంత్రులు రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గుడిసెల్లో నివసించే పేద కుటుంబాలకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని, పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారుగుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత గృహం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూ, రాష్ట్రంలో గృహరహితులు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మూడు లక్షల 50 వేల ఇండ్లు మొత్తంగా 8 లక్షల ఇండ్లు పేదలకు కట్టిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియలో పేదలు ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా అత్యంత పారదర్శకంగా వారి ఖాతాలోనే డబ్బులు పడే విధంగా అమలు చేస్తున్నామని ఇది ఎంతో గొప్ప విషయమని తెలిపారు. హైదరాబాద్ నుంచి బటన్ నొక్కితే నేరుగా డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో పడుతున్నాయని తెలిపారు. ఇంతకు ముందు ఇళ్ల నిర్మాణం చేపట్టి ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు సైతం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని



అమలు చేస్తున్నట్లు తెలిపారు ప్రతిపక్షాలు మతి భ్రమించి మాట్లాడుతున్నాయని, గత ప్రభుత్వం 8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీని గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రైతును రాజు చేయాలనే సంకల్పంతో రైతులందరికీ 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని తెలిపారు.బి×పెట్టుబడి సాయం కింద రైతులకు ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున 9,300 కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. రైతులు పండించిన సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ కూడా అందిస్తున్నట్లు తెలియజేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్లు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసినట్లు తెలియజేశార.ఇక ఉద్యోగాల విషయానికొస్తే ఇప్పటికే 72,000 ఉద్యోగాలను భర్తీ చేశామని త్వరలోనే మరో 22 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.వనపర్తి నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు మేఘారెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.పేద ప్రజలకు కుటుంబ సభ్యుడిగా ఉండి అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎమ్మెల్యే ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. మేఘా రెడ్డి నాయకత్వంలో వనపర్తి నియోజకవర్గానికి కేవలం ఇందిరమ్మ ఇండ్లకే రూ.275 కోట్లు వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. వనపర్తికి రెండో విడతలో భాగంగా 2000 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.స్థానిక శాసనసభ్యులు కోరిన విధంగా వనపర్తి నియోజకవర్గంలో సబ్ రిజిస్టర్ భవనాన్ని మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.అదేవిధంగా వనపర్తి నియోజకవర్గ కేంద్రంలో జర్నలిస్టుల కోరిక మేరకు ప్రెస్ క్లబ్ భవనం సైతం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక, మట్టి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, వీటి విషయంలో పేదలను ఇబ్బంది పెట్టకుండా ఉచితంగా ఇవ్వాలని ఆదేశించారు.

# ఇండొనేషియాలో 1000 ఏళ్ల క్రితం నాటి ఆలయాన్ని సందర్శించిన ప్రధాని మోదీ..

బ్యాంకాక్: ప్రధాని మోదీ ఇండోనేషియాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ దేశంలో ఉన్న వెయ్యేళ్ల క్రితం నాటి హిందూ ఆలయాన్ని ఆయన సందర్శించారు. యోగ్యకర్తలో ఉన్న ప్రంబనన్ ఆలయాన్ని ఆయన విజిట్ చేసి అక్కడ పూజలు నిర్వహించారు. ప్రధాని మోదీతో పాటు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కూడా ఆలయానికి వెళ్లారు. ప్రంబనన్ ఆలయంలో త్రిమూర్తులు కొలువై ఉన్నారు. బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుల నిలయమే ప్రంబనన్ ఆలయం. ప్రస్తుతం ఈ ఆలయం.. ప్రపంచ వారసత్వ సైట్‌లో ఉన్నది. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌కు చెందిన ఏరియల్ వీడియోను ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. ప్రబంనన్ ఆలయం అద్భుతంగా ఉన్నట్లు ఆయన ట్వీట్ చేశారు. ఆలయంలో కాసేపు ఓం నమ శివాయ అని భక్తులతో కలిసి మోదీ పూజలు చేశారు.దక్షిణాసియా దేశాల్లో ఉన్న అతిపెద్ద రెండవ ఆలయంగా ప్రంబనన్‌కు గుర్తింపు ఉన్నది. కాంబోడియాలో ఉన్న ఆంగకార్ వాట్ ఆలయం మొదటి స్థానంలో నిలుస్తుంది. ప్రంబనన్ ఆలయం సుమారు 40 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నది. ఆ ఆలయ సమూహంలో సుమారు 240 ఉప-ఆలయాలు ఉన్నాయి. ఇండోనేషియా సంస్కృతిలో ఈ ఆలయం ప్రత్యేకంగా నిలుస్తుంది. భారత్ ఉపఖండంలో ఇండోనేషియాతో ప్రత్యేకమైన అనుబంధం ఉందన్న సంకేతాన్ని ఇస్తుంది. 9వ శతాబ్ధంలో హిందూ మాతరం పాలకుల సమయంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. రాకాయి పికాటన్ అనే చక్రవర్తి ఈ ఆలయాన్ని ప్రారంభించినట్లు భావిస్తున్నారు. లోకపాల చక్రవర్తి సమయంలో దీని నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆ ఆలయ సమూహంలో మూడు ప్రధాన ఆలయాలు ఉన్నాయి.. వాటిల్లో బ్రహ్మ, విష్ణువు,




మహేశ్వరులు కొలువై ఉన్నారు. ఆ ఆలయ కాంప్లెక్స్ శివాలయం అత్యధికంగా 47 మీటర్ల ఎత్తు ఉన్నది.ఆలయాలపై విశేష రీతిలో శిల్ప కళ ఉన్నది. రామాయణంతో పాటు హిందూ పురాణాలకు చెందిన ఎన్నో శిల్పాలను చెక్కారు. ఆ కాలం నాటి మతపరమైన, సంస్కృతిక పరమైన ఎన్నో అంశాలు ఆ ఆలయ శిల్పాల్లో ఉన్నాయి. 10వ శతాబ్ధంలో ప్రంబనన్ ఆలయాన్ని వదిలేశారు.

జావాలో రాజకీయ మార్పులతో పాటు మౌంట్ మిరాపీ వద్ద అగ్నిపర్వతం పేలడం వల్ల ఆ ఆలయాన్ని తర్వాత కాలంలో విస్మరించారు. కానీ 19వ శతాబ్ధంలో డచ్ పాలన సమయంలో మళ్లీ పునరుద్దరణ జరిగింది. అయితే ఆ దేశ పురావాస్తు శాఖ 1913 నుంచి 1953 వరకు ఆ ఆలయాన్ని సమూహాన్ని పునర్ నిర్మించింది. 1991లో ప్రంబనన్ ఆలయానికి యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు వచ్చింది.

# సంపాదకీయం

గురువారం, జులై 09, 2026

## ఆరేళ్లలో 67 లక్షల సైబర్ నేరాలు

ప్రపంచం మొత్తం మీద డిజిటల్ డేటాలో భారతదేశం ఇప్పుడు 20 శాతానికి చేరుకుంది. డిజిటల్ చెల్లింపులు, స్మార్ట్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరగడంతో సైబర్ నేరాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు కృత్రిమ మేధస్సు (ఎఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీ ఉపయోగించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో ప్రజలను మోసగిస్తున్నారు. కొన్ని కోట్లు కొల్లగొడుతున్నారు. 2019-2025 వరకు 67.32 లక్షల సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండింట మూడొంతులు అంటే 43.22 లక్షల కేసులు గత రెండేళ్ల లోనే నమోదు కావడం గమనార్హం. గత ఆరేళ్లలో సైబర్ మోసాల ద్వారా సుమారు రూ. 55,000 కోట్లు బాధితులు నష్టపోయారు. అంటే ప్రతి ఐదు రూపాయల్లో నాలుగు రూపాయలు సైబర్ మోసాల ఖాతాకే చేరాయి. అంతేకాదు అశ్లీల పదజాలం కూడా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లద్వారా వ్యాప్తి చెందుతోంది.రేప్ వీడియో, చైల్డ్ వీడియో ద్వారా పిల్లలకు సంబంధించిన అసభ్యకరమైన పదజాలంతో పెయిడ్ యాడ్స్ కనిపించాయని వాటిని క్లిక్ చేసిన వినియోగదారులు టెలిగ్రామ్ ఛానెళ్లకు మళ్లించి ఆ వీడియోలను విక్రయిస్తున్నారని ఓ మీడియా సంస్థ బయటపెట్టగా ప్రభుత్వం స్పందించి ఆ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత మెటా సంస్థను గట్టిగా హెచ్చరించింది. ఇలాంటి సంఘటనలు చాలా పెద్ద సమస్యలో ఓ చిన్నభాగం మాత్రమే. రోజురోజుకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అంతకన్న వేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రత్యేక నియంత్రణ చట్టాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటివరకు డీప్‌ఫేక్స్, ఇతర సమస్యలను నివారించడానికి ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)చట్టంపై ఆధారపడుతూ వచ్చింది అయితే ఎఐ వ్యవస్థలు కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి, సాంకేతికతను సురక్షితంగా మార్చడానికి ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకు రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ పర్యావరణ వ్యవస్థ మనకు ఏర్పాటైంది. ఇందులో ఆధార్, యుపిఐ, ఒఎన్‌డిసి వ్యవస్థలు ఇమిడి ఉన్నాయి. ఆధార్ వల్ల ప్రజల గుర్తింపు స్థిరీకరణ జరగడమే కాక, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు నేరుగా చేరడానికి ఉపయోగపడుతుంది. యుపిఐ అన్నది తక్షణ చెల్లింపుల వ్యవస్థ. స్మార్ట్‌ఫోన్ ద్వారా చిల్లర వ్యాపారం నుండి పెద్దపెద్ద లావాదేవీల వరకు సెకన్లలో డబ్బులు పంపడానికి, స్వీకరించడానికి తోడ్పడుతోంది. ఒఎన్‌డిసి వాణిజ్య రంగాన్ని వికేంద్రీకరించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఓపెన్ నెట్‌వర్క్. దీని ద్వారా చిన్న వ్యాపారులు, స్థానిక విక్రేతలు, కూడా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించవచ్చు. ఈ ప్లాట్‌ఫారాలన్నీ సామాన్యుల దైనందిన జీవితాన్ని ఎంతో సులభతరం చేశాయి. ఇవి పాలనా వ్యవహారాలను, ఆర్థిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చాయి.ఈ సౌకర్యాలు ఎలా ఉన్నా డిజిటల్ దాడులు విస్తరించే ప్రమాదాలు కూడా పెరిగాయి. కృత్రిమ మేధస్సు సహాయంతో జరిగే సైబర్ దాడులను గుర్తించడం, వాటిని నివారించడం చాలా కష్టంగా మారుతోంది. ఈ దాడులు బ్యాంకింగ్, టెలికమ్యూనికేషన్స్, రక్షణ (డిఫెన్స్), విద్యుత్, ఆరోగ్య భద్రతరంగాలకు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారంగానే సైబర్ నేరగాళు అత్యంత నమ్మదగిన ఫిషింగ్ ఈ మెయిల్స్, డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ గుర్తింపులు, అధునాతన మాల్వేర్‌ను సృష్టిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ కనిపెట్టలేని విధంగా నిరంతరం తమ కోడ్‌ను మార్చుకునే మాల్‌వేర్‌ను సృష్టిస్తున్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎఐ టూల్స్ సహాయంతో హ్యాకర్లు సాఫ్ట్‌వేర్‌లో లోపాలను అందరికన్నా ముందుగానే పసిగట్టి దాడులకు పాల్పడుతున్నారు. వీటిని నివారించడం సైబర్ సెక్యూరిటీ నిపుణులకు పెద్ద సవాలుగా మారింది. సైబర్ ముప్పులను నివారించడానికి ప్రభుత్వం అనేక ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. ఇండియా ఎఐ మిషన్‌తోపాటు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి ఇన్) వ్యవస్థను బలోపేతం చేసింది. జీరో ట్రస్ట్ అనే పద్ధతిని స్వీకరించింది.సాధారణ భద్రత విధానాల్లో ఒకసారి నెట్‌వర్క్ లోకి ప్రవేశించిన ఎవరినైనా లేదా ఏదైనా పరికరాన్ని నమ్ముతారు. కానీ జీరో ట్రస్ట్ విధానంలో, నెట్‌వర్క్ లోపల ఉన్నా లేదా బయట ఉన్నా ఎవరినీ గుడ్డిగా నమ్మరు. ఆ వినియోగదారుడి పనికి అవసరమైన డేటా, ఫైల్స్ లేదా అప్లికేషన్‌కు మాత్రమే అనుసంధానం కలుగుతుంది. దీనివల్ల డేటా రక్షణ కలుగుతుంది. సైబర్ దాడుల నుండి డేటాను కాపాడుకోడానికి ప్రభుత్వ ఏజెన్సీలు సిఇఆర్‌టి ఇన్ వంటి సంస్థలు భద్రతా లోపాలను గంటల వ్యవధి లోనే పరిష్కరించాలన్న నిబంధనలు తీసుకు వస్తున్నారు. భారత్ ఏ దేశంపై ఆధారపడకుండా ఇప్పుడు స్వంతంగా కృత్రిమ మేధస్సు సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. రూ. 10,300 కోట్లకు పైగా బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించింది. లక్షలాది మందికి ఉపయోగపడేలా జిపియు కంప్యూటింగ్ (గ్రాఫింగ్ ప్రాసెసింగ్ యూనిట్), స్టార్టప్ ఫండింగ్ వ్యవస్థలను అందుబాటు లోకి తెస్తోంది. ఏదేమైనా ఈ ప్రయత్నాలన్నీ విచ్చిన్నంగానే ఉంటున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా మొత్తం 1,01,118 సైబర్ నేరాలు నమోదయ్యాయి. కాగా తెలంగాణలో వాటి సంఖ్య 27,230. అంటే తెలంగాణ వాటానే 27%గా నమోదయింది. రాష్ట్రంలో రోజుకు సగటున 75 సైబర్ నేరాల కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే తరహాలో కర్ణాటకలో 21,993 కేసులు నమోదై రెండోస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాల బారిన పడుతున్న బాధితుల్లో తెలంగాణ వాసులు దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.క్రైమ్‌రేట్ ఏకంగా 71.1 : ఒకవైపు సైబర్ నేరగాళ్ల ముఠాలు తెలంగాణ వాసుల్నే లక్ష్యంగా చేసుకొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటే మరోవైపు అభియోగాల నమోదు రేటు అధమ స్థానంలో ఉండటం విస్తుగొలుపుతోంది.

- ఎడిటర్

# హైదరాబాద్ కు క్యూ కడుతున్న ఇంటర్నేషనల్ వర్సిటీలు..

హైదరాబాద్, జూలై 8, (న్యూస్ పల్స్)తెలంగాణ గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 15 విదేశీ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో, యూకేకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ యూజీసీకి దరఖాస్తు చేసుకోగా.. మరికొన్ని వర్సిటీలు సంప్రదింపులు జరుపుతున్నాయి. ఈ విదేశీ క్యాంపస్‌ల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడంతో పాటు, మేధో వలసలు తగ్గి స్థానికంగానే ఉద్యోగ, పరిశోధన అవకాశాలు లభించనున్నాయి.ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ రంగాల్లో అంతర్జాతీయంగా దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం త్వరలోనే అంతర్జాతీయ ఉన్నత విద్యా రంగానికి కూడా గ్లోబల్ హబ్‌గా మారబోతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం 2020తో పాటు, యూజీసీ ప్రకటించిన నూతన సడలింపులు భారత్‌లో విదేశీ వర్సిటీల ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేశాయి. ఈ అనుకూల వాతావరణాన్ని ఉపయోగించుకుంటూ వివిధ దేశాలకు చెందిన సుమారు 15 ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి క్యూ కడుతున్నాయి. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఉన్న అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, శాంతిభద్రతలు, నివాసయోగ్యమైన వాతావరణం అంతర్జాతీయ సంస్థలను ఇటువైపు ఆకర్షిస్తున్నాయి.ఇప్పటికే ఈ ప్రక్రియలో భాగంగా అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో, యూకేకు చెందిన ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ క్యాంపస్‌ల ఏర్పాటు కోసం యూజీసీకి అధికారికంగా దరఖాస్తులు కూడా చేసుకున్నాయి. ప్రస్తుతానికి ఈ విశ్వవిద్యాలయాలన్నీ ప్రైవేట్ భాగస్వామ్యంతోనే స్వతంత్ర ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన ఒక ప్రముఖ వర్సిటీ వచ్చే విద్యాసంవత్సరం నుంచే క్లాసులు ప్రారంభించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఐటీ కారిడార్ గచ్చిబౌలిలోని ఒక భారీ కమర్షియల్ టవర్‌లో కొన్ని అంతస్తులను లీజుకు తీసుకునేందుకు ప్రభుత్వ వర్గాలతో చర్చలు జరుపుతోంది. తాత్కాలికంగా ఇక్కడ ప్రారంభించి భవిష్యత్తులో ప్రయోగశాలలు, స్పోర్ట్స్ అకాడమీలతో కూడిన శాశ్వత క్యాంపస్‌ల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది.మరికొన్ని టాప్ వర్సిటీలు కూడా క్యాంపస్‌ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికాకు చెందిన పర్డ్యూ యూనివర్సిటీ, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రతినిధులు ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికారులతో ప్రాథమిక సంప్రదింపులు పూర్తి చేశారు. అదేవిధంగా.. యూకేకు చెందిన బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియాకు చెందిన వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం ఇక్కడ ప్రత్యేకంగా క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. వీటితో పాటు న్యూ కాజిల్ యూనివర్సిటీ, చిచెస్టర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హెర్ట్‌ఫోర్డ్‌షైర్, న్యూజిలాండ్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ వైకాటో ప్రతినిధులు కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి తమ ప్రతిపాదనలను సమర్పించారు.తెలంగాణ నుంచి ప్రతి సంవత్సరం ఉన్నత చదువుల కోసం వేల సంఖ్యలో విద్యార్థులు కోట్లాది రూపాయల ధనాన్ని వెచ్చించి అమెరికా, యూకే, కెనడా వంటి దేశాలకు వలస వెళ్తున్నారు. అంతర్జాతీయ స్థాయి విద్య ఇక్కడే అందుబాటులోకి రావడం వల్ల అక్కడకు వెళ్లే అవసరం ఉండదు. ఈ క్యాంపస్‌ల నిర్మాణాల ద్వారా రాష్ట్రంలోకి భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రానున్నాయి. అంతేకాకుండా, బోధన, బోధనేతర రంగాల్లో, ఐటీ సపోర్ట్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలలో స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పరిశ్రమలకు సమీపంలో ఈ క్యాంపస్‌లు ఉండటం వల్ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ కార్పొరేట్ ప్రాజెక్టులు సులభంగా దక్కుతాయి.పరిశోధనల విషయానికొస్తే, విదేశీ వర్సిటీలు కేటాయించే భారీ రీసెర్చ్ ఫండ్స్ స్థానిక పీహెచ్‌డీ విద్యార్థులకు వరంగా మారనున్నాయి. హైదరాబాద్‌లోని ఐఐటీ, బిట్స్ పిలానీ, సెంట్రల్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి ఈ గ్లోబల్ వర్సిటీలు సంయుక్త పరిశోధనలు చేపట్టే అవకాశం ఉంది.

# అలక పాన్పు ఎక్కిన కొండా



వరంగల్, జూలై 8, (న్యూస్ పల్స్)తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న రాజకీయ వైరం ఇప్పుడు అధికారికంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది.లంగాణ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తన శాఖలో ఎమ్మెల్యేల జోక్యాన్ని కొండా సురేఖ ఆమె ప్రస్తావించారు. తాను పర్యవేక్షిస్తున్న దేవాదాయ శాఖ లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షలు చేయడం ఏంటని లేఖలో ప్రశ్నించారు. మంత్రిత్వ శాఖలో ఎమ్మెల్యేల జోక్యం ఏమిటని కొండా సురేఖ నిలదీశారు. దీనిపై క్రమశిక్షణ కమిటీ చేత విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కడియం శ్రీహరి సమీక్షలు చేస్తూ... ఇతరులు సమీక్షలు చేయడం వల్ల మంత్రిత్వ శాఖలో గోప్యత ఉండదని, దాని వల్ల మంత్రులకే కాకుండా ప్రభుత్వానికి కూడా ఇబ్బందిగా మారతాయని కొండా సురేఖ రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఆదిలోనే తుంచి వేయకపోతే ప్రతి ఒక్కరూ ప్రతి మంత్రిత్వ శాఖలోజోక్యం చేసుకునే ప్రమాదం ఉందని కూడా కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనను పూర్తిగా విస్మరించి, తన శాఖా పరిధిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జూలై 7, 2026 నాటి అధికారిక లేఖ ద్వారా ఆమె సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా ఫిర్యాదు చేస్తూ.. కడియం శ్రీహరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతోంది.ఈ వివాదానికి అసలు కారణం.. జూలై 6వ తేదీన హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిర్వహించిన ప్రత్యేక సమావేశమే. మంత్రి సురేఖకు గానీ, ఆమె కార్యాలయానికి గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. కడియం శ్రీహరి నేరుగా దేవాదాయ శాఖ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని పలు దేవాలయాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. అంతేకాకుండా, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, ప్రత్యేక అధికారుల బృందం ఏర్పాటు, ఒక నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలంటూ అధికారులకు ఎమ్మెల్యే స్థాయిలోనే ఆదేశాలు జారీ చేయడంపై కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.మాస్టర్ ప్లాన్లు, అధికారుల కమిటీల ఏర్పాటు వంటివి పూర్తిగా శాఖా మంత్రి స్థాయిలో నిర్ణయించాల్సిన అంశాలు. ఒక ఎమ్మెల్యే ఇలా సమీక్ష చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయం. ఇది కేవలం పరిపాలనా లోపం కాదు, నా రాజ్యాంగబద్ధ అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే ప్రయత్నం అని కొండా సురేఖ లేఖలో సీఎంకు కుండబద్దలు కొట్టారు. నా దేవాదాయ శాఖలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం సరికాదు నాకు సమాచారం ఇవ్వకుండా అధికారులతో కడియం శ్రీహరి సమీక్ష జరిపాడుఈ లేఖ ద్వారా వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఉన్న పాత గ్రూపు రాజకీయాలు మరోసారి బట్టబయలయ్యాయి. గతంలో కూడా తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి నాపై దుష్ప్రచారం చేయించారని, ఆ కుటిల ప్రయత్నాలు విఫలమయ్యాయని సురేఖ నేరుగా సీఎంకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కడియం శ్రీహరికి పార్టీలో విపరీతమైన ప్రాధాన్యత ఇస్తూ.. కనీసం సీనియర్ మంత్రి అయిన తన శాఖలోనే జోక్యం చేసుకునేలా ప్రోత్సహించడంపై ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది.దేవాదాయ శాఖ మంత్రికి సమాచారం లేకుండా ఎమ్మెల్యే ఎలా సమీక్ష నిర్వహిస్తారనే దానిపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన ప్రెస్ నోట్, ఫోటోలు, దినపత్రిక క్లిప్పింగులను కూడా సీఎంకు జతపరిచారు. ఒకవైపు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. సీనియర్ లీడర్లు అయిన కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య ఈ లేఖాస్త్రాల యుద్ధం ఎటు దారితీస్తుందో, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారో అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

## పల్లెల ప్రగతి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

### అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి





నిజామాబాద్, జూలై 08 : గ్రామాల సంపూర్ణ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్ లు, గ్రామ సచివాలయ కార్యదర్శులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ అమలు, పన్ను వసూళ్లు, తడి, పొడి చెత్త, హానికారక, సానిటేషన్ వ్యర్థాల సేకరణ, వీబీ జీ రాంజీ అమలు తీరు, మౌలిక వసతులు, సదుపాయాల కల్పన, వాటర్ షెడ్ కార్యక్రమాల అమలు, లింకు రోడ్లు, సీ.సీ రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాల నిర్వహణ, నిధుల వినియోగం, వన మహోత్సవం, తాగు నీటి సరఫరా పర్యవేక్షణ, పాఠశాలలు, అంగన్వాడీలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ సంస్థల నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన, పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను గుర్తిస్తూ, వాటి పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ లు, కార్యదర్శులు పరస్పర సమన్వయంతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని, తద్వారా సంబంధిత అధికారులు, సిబ్బందితో నిర్దేశిత పద్ధతిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చని సూచించారు. ఏ గ్రామానికి ఏం అవసరం ఉంది అన్న వివరాలను ప్రభుత్వం తెలుసుకునేందుకు, తద్వారా అవసరమైన నిధులు, తగిన వనరులను సమకూర్చేందుకు గ్రామ పంచాయతీల సమగ్ర ప్రణాళిక దోహదపడుతుందని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తిస్తూ, 2026 ? 2029 కాల పరిమితితో కూడిన మూడు సంవత్సరాలకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ద్వారా ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని అన్నారు. అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని హితవు పలికారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని గుర్తు చేశారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అందరి సమన్వయంతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణాలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, సమగ్ర ప్రణాళికలు రూపొందించుకుని, తదనుగుణంగా ముందుకు వెళ్తే పల్లెలన్ని సంపూర్ణ ప్రగతితో వికసిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలు, సర్పంచ్ లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నంకీన్ కన్వెన్షన్

హైదరాబాద్,దేశంలోని రూ. 1.5 లక్షల కోట్ల విలువైన మిఠాయి-నంకీన్ పరిశ్రమకు చెందిన అతిపెద్ద వ్యాపారాల్లో ఒక్కటైన వరల్డ్ మిఠాయి నంకీన్ కన్వెన్షన్ (డబ్ల్యూఎంఎస్సీ) పర్చేజింగ్ ను ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో జరగనుంది. ఈ కన్వెన్షన్కు సంబంధించిన పోస్టర్ ను బంజారాహిల్స్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నంకీన్ మ్యానఫ్యాక్చరర్స్ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ దీనిని ఆవిష్కరించి మాట్లాడారు. పండుగల సీజన్ కు ముందు దేశవ్యాప్తంగా తయారీదారులు, సరఫరాదారులు, రిటైలర్లను ఒకే వేదిక పైకి తీసుకురావడమే ఈ కన్వెన్షన్ లక్ష్యమని తెలిపారు. 'పర్ఫెక్ట్ స్టార్ట్ టుది ఫెస్టివ్ సీజన్' అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ కన్వెన్షన్లో దేశవ్యాప్తంగా మిఠాయి, నంకీన్, బేకరీ, స్నాక్స్ రంగాలకు చెందిన తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, టెక్నాలజీ సంస్థలు, రిటైలర్లు పాల్గొననున్నట్లు వివరించారు.దేశంలోని రూ. 1.5 లక్షల కోట్ల విలువైన మిఠాయి- నంకీన్ పరిశ్రమకు చెందిన అతిపెద్ద వ్యాపారాల్లో ఒక్కటైన వరల్డ్ మిఠాయి నంకీన్ కన్వెన్షన్ (డబ్ల్యూఎంఎస్సీ) పర్చేజింగ్ ను ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో జరగనుంది. ఈ కన్వెన్షన్కు సంబంధించిన పోస్టర్ ను బంజారాహిల్స్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నంకీన్ మ్యానఫ్యాక్చరర్స్ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ దీనిని ఆవిష్కరించి మాట్లాడారు. పండుగల సీజన్ కు ముందు దేశవ్యాప్తంగా తయారీదారులు, సరఫరాదారులు, రిటైలర్లను ఒకే వేదిక పైకి తీసుకురావడమే ఈ కన్వెన్షన్ లక్ష్యమని తెలిపారు. 'పర్ఫెక్ట్ స్టార్ట్ టుది ఫెస్టివ్ సీజన్' అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ కన్వెన్షన్లో దేశవ్యాప్తంగా మిఠాయి, నంకీన్, బేకరీ, స్నాక్స్ రంగాలకు చెందిన తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, టెక్నాలజీ సంస్థలు, రిటైలర్లు పాల్గొననున్నట్లు వివరించారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమం పై కలెక్టర్ సమావేశం

ఖమ్మం,ఖమ్మంకలెక్టరేట్ మిటింగ్ హాల్ నందు జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ాఎఖీ) కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు.ప్రతి అర్హమైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షిస్తూ, ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ాఎఖీ) కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను దాదాపు పంపిణీ పూర్తి చేశామని, వాటిని తిరిగి సేకరించి ఆన్లైన్లో నమోదు చేసే డిజిటైజేషన్ ప్రక్రియను చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (ఃఒంబ), బూత్ లెవల్ అధికారులు (ఃఒూబ), ప్రజలు సమిష్టిగా సహకరించాలని కోరారు.

# ఉగ్రామ్ అద్భుతం...

## తెలంగాణ స్టార్టప్ రెడీ

హైదరాబాద్, జూలై 8 (న్యూస్ పల్స్)తెలంగాణకు చెందిన రక్షణ స్టార్టప్ 'ద్వీప డిఫెన్స్' డీఆర్డీవోతో కలిసి అద్భుతం చేసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత స్వదేశీ ఆయుధాల తయారీపై డీఆర్డీవో దృష్టి పెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్రం కూడా రక్షణ బడ్జెట్ పెంచింది. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన స్టార్టప్ 7.62ఖ51 ఎంఎం క్యాలిబర్‌లో ఉగ్రం(జఉ ఖీంఓ) అనే దేశీ రైఫిల్‌ను అభివృద్ధి చేసింది. ఈ ప్రాజెక్టును కేవలం 100 రోజుల్లోనే డిజైన్ చేసి, నమూనా తయారు చేయడం రక్షణ రంగంలో వేగాన్ని పెంచింది. సాధారణంగా ఆయుధాల అభివృద్ధికి సంవత్సరాలు పట్టే పరిస్థితుల్లో ఈ వేగం ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి బలం చేకూర్చుతోంది. ఉగ్రమ్ రైఫిల్ భారత సైన్యం, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్వహించిన కఠినమైన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. దీంతో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఈ రైఫిల్‌ను తమ ఆయుధభండారంలో చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. సాధారణంగా విదేశీ ఆయుధాలపై ఆధారపడే సీఏపీఎఫ్‌కు దేశీ రైఫిల్ అందుబాటులోకి రావడంతో ఖర్చు తగ్గడం, సరఫరా భద్రత పెరగడం, నిర్వహణ సౌలభ్యం వంటి ప్రయోజనాలు ఏర్పడతాయి. డీఆర్డీవోకి చెందిన ఆయుధ పరిశోధన, అభివృద్ధి సంస్థతో స్టార్టప్ సంయుక్తంగా పని చేయడంతో ఈ వేగం సాధ్యమైంది. ప్రైవేట్‌రంగ స్టార్టప్‌లు తమ సౌలభ్యం, ఆవిష్కరణ సామర్థ్యం, త్వరిత నిర్ణయాలతో డీఆర్డీవో సాంకేతిక నైపుణ్యాన్ని మిళితం చేస్తున్నాయి. ఇది రక్షణ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ఎంత ముఖ్యమో చాటుతోంది. 100 రోజుల్లో డిజైన్ నుంచి నమూనా వరకు పూర్తి చేయడం భవిష్యత్తులో అత్యవసర అవసరాలకు త్వరితంగా స్పందించే సామర్థ్యాన్ని నిరూపిస్తోంది. ఈ విజయం రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. సీఏపీఎఫ్‌కు వంటి పెద్ద సంఖ్యలో ఆయుధాలు అవసరమయ్యే బలగాలకు స్థానికంగా ఉత్పత్తి అయ్యే రైఫిల్‌లు అందుబాటులోకి రావడం వల్ల దేశీయ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో రక్షణ స్టార్టప్‌లు వృద్ధి చెందడం దేశవ్యాప్తంగా రక్షణ తయారీ పర్యావరణ వ్యవస్థను బలపరుస్తోంది. ఉగ్రం విజయం తర్వాత ఇలాంటి స్టార్టప్‌లు మరిన్ని ఆయుధాలు, సామగ్రి అభివృద్ధిలో ముందుకు రావడానికి మార్గం సుగమం అవుతోంది. డీఆర్డీవోతో సహకారం కొనసాగితే, భారత్ రక్షణ రంగంలో ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు సాధించే అవకాశాలు పెరుగుతాయి. ఈ మోడల్ ఇతర రంగాల్లో కూడా ప్రైవేట్ రంగం, ప్రభుత్వ సంస్థల మధ్య సహకారానికి ఆదర్శంగా నిలుస్తుంది.

# పవన్ వీరాభిమాని మృతి

వరంగల్, జూలై 8 (న్యూస్ పల్స్)అభిమానిని కలవడానికి స్టార్ హీరోగా కాదు.. ఆప్తుడిలా అతడి ఇంటి గుమ్మం దాటారు పవన్ కళ్యాణ్. మంచానికే పరిమితమైన ఆ బాలుడి చేతిని పట్టుకుని ధైర్యం చెప్పారు. "మనిద్దరం కలిసి ూఉ సినిమా చూద్దాం.. ూఉ 2 వస్తే నువ్వే నా స్పెషల్ గెస్ట్" అని ప్రేమగా మాటిచ్చారు. కానీ ఆ కల నిజమయ్యేలోపే.. ఆ అభిమాని ఈ లోకాన్ని విడిచిపెట్టాడు. హనుమకొండ హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల పొనుగంటి నిరంజన్ గత కొంతకాలంగా అరుదైన న్యూరోమస్క్యులర్ జన్యు వ్యాధితో పోరాడుతున్నాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరిన అతడి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించింది. వైద్యుల ప్రయత్నాలు ఫలించక బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. ఈ వార్తతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు తీవ్రగ్భ్రాంతికి గురయ్యారు. నిరంజన్‌కు పవన్ కళ్యాణ్ అంటే ప్రాణం. పవన్ పాటలు, డైలాగ్‌లతో చేసిన అతడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ విషయం పవన్ దృష్టికి చేరింది. వెంటనే జూన్ 17న స్వయంగా అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కొద్దిసేపు అతడి పక్కనే కూర్చుని మాట్లాడారు. ప్రేమగా హత్తుకుని ధైర్యం చెప్పారు. "అందరూ నన్ను 'చోటా గబ్బర్ సింగ్' అని పిలుస్తారు" అని నిరంజన్ చెప్పినప్పుడు పవన్ కూడా చిరునవ్వుతో ఆనందం వ్యక్తం చేశారు. వెళ్లే ముందు బహుమతులు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తూ త్వరలో మళ్లీ కలుద్దామని చెప్పారు. తనకు కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పగా.. ఆరోజే కుక్క పిల్లను అందించారు. అయితే ఆ ఆప్యాయ భేటీ జ్ఞాపకంగా మిగిలిపోగా.. కొన్ని రోజులకే నిరంజన్ మృతి చెందడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. ఒక అభిమాని చివరి కోరికను నెరవేర్చాలని కోరుకున్న హీరో.. ఇప్పుడు అదే అభిమానిని కోల్పోవాల్సి రావడం అభిమానులను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తోంది.

# సెంటిమెంట్ తో కమలం వ్యూహం...

హైదరాబాద్, జూలై 8, (న్యూస్ పల్స్)తెలంగాణ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై పట్టు సాధించేందుకు వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలంగాణ పర్యటన తర్వాత కొంత నేతల్లో సమన్వయం కనిపిస్తుంది. అలాగే సెంటిమెంట్ ను రగిలించాలని బీజేపీ నేతలు ఈ ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు అర్థమవుతుంది. తాజాగా బీజేపీ రాష్ట్ర నేతలు ఎంఐఎం, హైడ్రా ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. బీజేపీ చేస్తున్న విమర్శలకు ఎంఐఎం ప్రతి విమర్శలు చేస్తూ కమలం పార్టీ ట్రాప్ లో పడినట్లు కనిపిస్తుంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే పతంగి పార్టీ విమర్శలతో బీజేపీ ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.. హైడ్రాను ముందర పెట్టి బీజేపీ విమర్శలకు గత కొద్ది రోజలుగా దిగుతోంది. హైడ్రా కేవలం సామాన్యులు, పేదలు జోలికి మాత్రమే పోతుందని, ఎంఐఎం నేతల ఆక్రమణల జోలికి వెళ్లడం లేదని ఆరోపిస్తుంది. బీజేపీ చీఫ్ రామ్ చందర్ రావు తో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కూడా హైడ్రాపై వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, ఎంఐఎంకు చెందిన ఆక్రమణల జోలికి వెళ్లడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. ఫాతిమా కళాశాలను ఆక్రమించి నిర్మించారని, దానిని కూల్చివేయడంలో హైడ్రా అధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నారని ప్రశ్నించారు. కేవలం పేదల ఇళ్లను కూల్చివేయడానికే హైడ్రాను ఏర్పాటు చేసినట్లుందని అభిప్రాయపడ్డారు. హైడ్రా కొందరి నిర్మాణాలనే కూల్చివేస్తుందని, హైకోర్టు ఎన్ని తీర్పులు చెప్పినా హైడ్రా మాత్రం తన వైఖరిలో మాత్రం మార్పు తీ రావడం లేదని బీజేపీ నేతలు అంటున్నారు.. దీనికి ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. తమను భయపెట్టాలని కొందరు చూస్తున్నారని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. బెదిరింపులకు లొంగేది లేదని అన్నారు. ఎంఐఎంకు చెందిన విద్యాసంస్థలను కూల్చివేస్తామని కొందరు బెదిరిస్తున్నారని, కానీ ఇలాంటి బెదిరింపులకు తాము భయపడేది లేదని తెలిపారు. ఫాతిమా కళాశాలపై ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పందించారు. తమ విద్యాసంస్థను ఎలా కాపాడు కోవాలో తమకు తెలుసునని అన్నారు.

# కాక్ రోచ్ ఈజ్ బ్యాక్




హైదరాబాద్, జూలై 8 (న్యూస్ పల్స్) సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీజేపీ ఎక్స్ ఖాతాను బ్లాక్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. నీట్ పునఃపరీక్ష పూర్తయిన నేపథ్యంలో ఖాతాను బ్లాక్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ కేసును జస్టిస్ స్వర్ణ కాంత శర్మ విచారించారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ రీ-ఎగ్జామినేషన్ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం తలెత్తకుండా ఉండేందుకే సీజేపీ ఎక్స్ ఖాతాను తాత్కాలికంగా బ్లాక్ చేసినట్లు కోర్టుకు తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు హాజరయ్యే జాతీయ స్థాయి పరీక్ష సమయంలో సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే పోస్టులు పరీక్ష నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్రం భావించిందని వివరించారు. కేంద్రం జారీ చేసిన బ్లాకింగ్ ఉత్తర్వును సవాల్ చేస్తూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫు న్యాయవాదులు, సోషల్ మీడియా ఖాతాను నిలిపివేయడం భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని వాదించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు, ప్రస్తుత పరిస్థితుల్లో ఖాతాను బ్లాక్ చేయడానికి ఎలాంటి కారణం లేదని తేల్చింది. నీట్ పునఃపరీక్ష ఇప్పటికే పూర్తయినందున కేంద్రం వ్యక్తం చేసిన ప్రాథమిక ఆందోళనకు ఇప్పుడు ప్రాధాన్యం లేదని పేర్కొంది. మరోవైపు, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కూడా కొనసాగుతోంది. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో నిరసనకారులు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆయన బరువు 7.3 కిలోలు తగ్గినట్లు తాజా వైద్య నివేదికల్లో పేర్కొన్నారు. రక్తపోటు 102/61 ఎంఎంహెచ్‌జీగా, రక్తంలో గ్లూకోజ్ స్థాయి 68 ఎంజీ/డీఎల్‌గా నమోదైనట్లు తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని నిర్వాహకులు వెల్లడించారు. దీర్ఘకాల నిరాహార దీక్ష ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నప్పటికీ, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టు తాజా తీర్పుతో సీజేపీ ఎక్స్ ఖాతా పునరుద్ధరణకు మార్గం సుగమం కాగా, భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ అధికారాలపై మరోసారి చర్చ ప్రారంభమైంది. కాగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించిన ప్రకారం, జూన్ 21న జరిగిన నీట్ రీ-టెస్ట్‌కు ముందు విద్యార్థుల్లో అనవసర ఆందోళనలు, అపోహలు వ్యాపించే అవకాశం ఉద్దేశంతోనే కేంద్రం ఈ చర్య తీసుకుంది. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు. మే 21న దాని అసలు ఎక్స్ ఖాతాను భారతదేశంలో నిలిపివేశారు. అనంతరం ఈ బృందం 'పేరుతో మరో కొత్త ఎక్స్ ఖాతాను ప్రారంభించింది. ప్రస్తుతం ఆ ఖాతాకు రెండు లక్షల 27 వేలకుపైగా ఫాలోవర్లు ఉన్నారు.

# గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో ఓవైసీ వ్యూహం..

హైదరాబాద్, జూలై 8, (న్యూస్ పల్స్)ఎం ఐ ఎం చీఫ్? అసదుద్దీన్ ఓవైసీ చాలా రోజుల తర్వాత హైదరాబాద్ లో చిచ్చు రాజేశాడు. సోషల్ మీడియా వేదికగా సౌత్, వెస్ట్ హైదరాబాద్ నుంచి అనేక ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు మార్చడం అన్యాయమని, ఇది సాధారణ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతోందని వ్యాఖ్యానించారు. గుడిమాల్కాపూర్ మార్కెట్ తరలింపును ఆధారంగా చేసుకుని, నగరంలోని వివిధ జోన్ల మధ్య వివక్ష ఉందనే పెద్ద అంశాన్ని తెరపైకి తెచ్చారు. పాతనగరం సౌత్ పరిధిలోకి, మెహదీపట్నం-కార్వాన్ పరిసరాలు వెస్ట్ పరిధిలోకి వస్తాయి. ఈ నిర్ణయాలు ప్రాంతాల మధ్య అసమానతను పెంచుతున్నాయని, స్థానికుల భావోద్వేగాలను రెచ్చగొట్టాడు. ఇటీవలి సంవత్సరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, శాంతిభద్రతను మెరుగుపరచడం, శివారు ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన కార్యాలయాలు, విభాగాలను రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొత్త భవనాలకు, తూర్పు-ఉత్తర శివార్లకు మార్చింది. ఇందులో కలెక్టరేట్ సంబంధిత విభాగాలు, వక్ఫ్ బోర్డ్ ప్రాంతీయ కార్యాలయాలు, పోలీస్ నిర్వహణ కార్యాలయాలు, మార్కెటింగ్ శాఖ నోడల్ కార్యాలయాలు ఉన్నాయి. పాతనగరంలోని ఇరుకైన రోడ్లు, అధిక జనసాంద్రత వల్ల రోజూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. కొత్త ప్రాంతాల్లో విశాలమైన రోడ్లు, మెరుగైన కనెక్టివిటీ, ఆధునిక సౌకర్యాలు ఉండటం వల్ల పరిపాలన సౌలభ్యం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. శివార్ల అభివృద్ధి ద్వారా నగరం మొత్తం సమతుల్యంగా వృద్ధి చెందాలనేది లక్ష్యంఓవైసీ ఇలా జోన్ల వారీగా అసంతృప్తిని బయటపెడుతున్నారనేది బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయి. పాతనగరం ఎంఐఎంకు ఎప్పటి నుంచో బలమైన ఆధారం. అయితే వెస్ట్ జోన్‌లో ఐటీ కారిడార్ విస్తరణ వల్ల మెహదీపట్నం, కార్వాన్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో జనాభా మార్పులు పార్టీకి కొత్త సవాళ్లను తెస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉద్యోగులు, కుటుంబాలు నివసించడం వల్ల స్థానిక సంప్రదాయ ఓటర్ల నిష్పత్తి మారుతోంది. ఈ ప్రాంతాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు లేదా వ్యాపార కేంద్రాలు శివార్లకు తరలిపోతే, స్థానిక మైనారిటీల ఆర్థిక వనరులు దెబ్బతినడమే కాక, చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు ప్రభావితమవుతారు. గుడిమాల్కాపూర్ వంటి సాంప్రదాయ మార్కెట్లు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవి. అందుకే ప్రభుత్వం సౌత్, వెస్ట్ హైదరాబాద్‌ను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందనే భావోద్వేగ అంశాన్ని ఉపయోగిస్తున్నారు. సాధారణ పరిపాలనా మార్పులను కూడా ప్రాంతీయ వివక్షగా చిత్రీకరించడం ద్వారా, పాతనగరంలోని కొత్త ఓటర్లను, వెస్ట్ హైదరాబాద్‌లోని వ్యాపార వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకం చేయాలనేది ఓవైసీ ప్రధాన ప్రణాళిక. నగర అభివృద్ధి అంతా హైటెక్ సిటీ లేదా ఉత్తర హైదరాబాద్ వైపు మాత్రమే జరుగుతోందని, సౌత్-వెస్ట్ ప్రాంతాలను పాలకులు వదిలేస్తున్నారని బలంగా ప్రచారం చేసి, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో తమ ఓటు బ్యాంకును రక్షించుకోవడానికి ఈ భౌగోళిక వ్యూహాన్ని అనుసరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విధానం ద్వారా స్థానిక సంఘాల్లో ఐక్యతను పెంపొందించి, ప్రత్యర్థి పార్టీల ప్రభావాన్ని తగ్గించాలనేది ఓవైసీ లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ వివాదం మరింత రాజకీయ దుమారానికి దారితీసే అవకాశం ఉంది. స్థానిక సంఘాల నుంచి నిరసనలు, ప్రజా ఉద్యమాలు రావచ్చు. ఇదే సమయంలో ప్రభుత్వం మరోవైపు నగరం మొత్తం అభివృద్ధిని నొక్కి చెప్పి, తరలింపు నిర్ణయాలను సమర్థించవచ్చు. ఓవైసీ ఈ అంశాన్ని ఎక్కువగా ఉపయోగిస్తే, ఎన్నికల సమయంలో ఓటర్ల మధ్య చర్చలు ఎక్కువవుతాయి. ఈ చర్చ నగర అభివృద్ధి, ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ వ్యూహాల మధ్య సంబంధాన్ని స్పష్టం చేస్తోంది.

# కొడంగల్ టూ శంషాబాద్ లైన్ క్లియర్

హైదరాబాద్, జూలై 8, (న్యూస్ పల్స్)రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మక రేడియల్ రోడ్-2 నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. శంషాబాద్-షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో పది రోజుల్లో భూములు సేకరించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. రైతులతో జరిపిన చర్చలు సఫలమవడంతో ఆర్ఆర్ యాక్ట్-2013 ప్రకారం పారదర్శక పరిహారానికి రైతులు అంగీకార పత్రాలు ఇచ్చారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 81 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారి వల్ల శంషాబాద్, షాద్‌నగర్ ప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్లు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి . హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతికి, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా అత్యంత కీలకమైన రేడియల్ రోడ్-2 నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు శంషాబాద్-షాద్‌నగర్ డివిజన్లలో భూసేకరణ ప్రక్రియను చేపట్టాలని రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ముట్‌పూర్, చుక్కమెట్, లాలాపేట్, ఉమ్మెత్యాల్, తుమ్మపల్లి గ్రామాల్లో ఈ రహదారి కోసం అవసరమైన భూములను రాబోయే పది రోజుల్లోనే పూర్తిస్థాయిలో సేకరించడానికి కసరత్తు ప్రారంభించారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారిలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, షాద్‌నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ చర్యలు తీసుకున్నారు. రైతుల తరపున ప్రతినిధులతో ఉన్నత స్థాయి సంప్రదింపులు, ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ భూసేకరణ చట్టం ఆర్ఆర్ యాక్ట్-2013 నిబంధనల ప్రకారం పారదర్శకమైన పద్ధతిలో మార్కెట్ ధరకు అనుగుణంగా తగిన పరిహారాన్ని అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సానుకూల చర్చల అనంతరం భూములు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతుల నుంచి అధికారులు అధికారిక అంగీకార పత్రాలను సేకరించారు. రేడియల్ రోడ్-2 ప్రాజెక్టును రాజధాని శివార్లలోని బుద్వేల్ నుంచి ప్రారంభించి షాబాద్, కొందూర్, పరిగి మీదుగా ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ వరకూ మొత్తం 81 కిలోమీటర్ల మేర అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే శంషాబాద్, షాబాద్ మండలాలలో ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్లకు, కొత్తగా రాబోతున్న ఐటీ పరిశ్రమలకు అంతర్జాతీయ స్థాయి రవాణా సౌకర్యం లభించనుంది. ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కార్గో టెర్మినల్ నుంచి నేరుగా షాబాద్, కొడంగల్ ప్రాంతాలల్లోని భారీ పరిశ్రమలకు అవసరమైన భారీ యంత్రాలు, ముడిపదార్థాలు, విదేశీ పరికరాలను వేగంగా, సులభంగా తరలించడానికి ఈ మార్గం అనుకూలంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. రేడియల్ రోడ్-2 నిర్మాణం పూర్తికావడం ద్వారా శంషాబాద్-షాద్‌నగర్ ప్రాంతాల మధ్య సరికొత్త పారిశ్రామిక జోన్లు ఏర్పడేందుకు అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు కీలక ప్రాంతాల మధ్య కేవలం హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా మాత్రమే పరిమిత సంఖ్యలో పరిశ్రమలు నడుస్తున్నాయి. అయితే.. ఈ నూతన ఆర్ఆర్-2 రహదారి ద్వారా అంతర్గత ప్రాంతాలైన షాబాద్, షాద్‌నగర్ డివిజన్‌లోని కొందూరు, చౌదరిగూడ వంటి గ్రామీణ మండలాల్లోకి కూడా పారిశ్రామికీకరణ విస్తరిస్తుంది.

# భారీగా పెరగనున్న ఆస్తి పన్ను

హైదరాబాద్, జూలై 8, (న్యూస్ పల్స్)హైదరాబాద్ మహానగర మున్సిపల్ పరిపాలనా వ్యవస్థలో గత ఏడు దశాబ్దాలలోనే ఎన్నడూ లేనంతటి అతిపెద్ద సంస్కరణకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1955 నాటి పాత జీహెచ్ఎంసీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తూ.. మారుతున్న కాలం, వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా సరికొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా ది డ్రాఫ్ట్ కోర్ అర్బన్ రీజియన్ బిల్, 2026 ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. క్యూర్ బిల్లుగా పిలుస్తున్న ఈ మార్పును హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో పౌర సేవలను మరింత వేగవంతం చేయడానికి, పరిపాలనను ఆధునీకరించడానికి ఈ చారిత్రాత్మక బిల్లును రూపకల్పన చేసినట్లుగా చెబుతున్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోకి వచ్చే జీహెచ్ఎంసీ , సైబరాబాద్ , మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఒకే సమగ్ర పరిపాలనా చట్టం కిందికి తీసుకురావడం. ప్రస్తుతం నగరంలో అర్బన్ ప్లానింగ్, రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రవాణా, ప్రజారోగ్యం, విపత్తు నిర్వహణ వంటి సేవలను వేర్వేరు విభాగాలు చూస్తుండటంతో సమన్వయ లోపం ఏర్పడుతోంది. ఈ కొత్త చట్టం ద్వారా ఈ విభాగాలన్నింటినీ అనుసంధానించనున్నారు. తద్వారా ప్రాజెక్టుల అమలు వేగవంతం కావడమే కాకుండా పౌరులకు నాణ్యమైన సేవలు అందుతాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న యాన్యువల్ రెంటల్ వాల్యూ ఆధారిత ఆస్తి పన్ను విధానానికి ఈ బిల్లు స్వస్తి పలకనుంది. దీని స్థానంలో మార్కెట్ రేట్లకు అనుగుణంగా ఉండే క్యాపిటల్ వాల్యూ ఆధారిత సరికొత్త ఆస్తి పన్ను అసెస్‌మెంట్ నమూనాను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఒక స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. వీటితో పాటు జీఐఎస్ ఆధారిత అర్బన్ ప్లానింగ్, భూగర్భ యూటిలిటీల సమగ్ర నిర్వహణ, ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పౌర సేవలు, సులభతర వాణిజ్యం లో భాగంగా సింగిల్ ట్రేడ్ లైసెన్స్ విధానం, సరళీకృత భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ వంటి కీలక సంస్కరణలను ఇందులో పొందుపరిచారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే భవనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సకాలంలో పన్నులు చెల్లించే వారికి రిబేటులు కూడా ఇవ్వనున్నారు. ఈ డ్రాఫ్ట్ అజఖీఇ బిల్-2026 ను ప్రజల అభిప్రాయాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. హైదరాబాద్ నివాసితులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, నిపుణులు, పారిశ్రామిక రంగానికి చెందిన ప్రముఖులు ఈ ముసాయిదాను పరిశీలించి, తమ విలువైన సలహాలు, సూచనలను జూలై 24, 2026 లోగా సమర్పించాలని జీహెచ్ఎంసీ కోరింది. అధికారిక జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ ఫీడ్‌బ్యాక్‌ను పంపవచ్చని, వచ్చిన సూచనలను నిశితంగా పరిశీలించిన తర్వాతే బిల్లుకు తుది రూపునిచ్చి అసెంబ్లీలో ప్రవేశపెడతామని ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ బిల్లు నగర పాలనలో కొత్త మార్పు తీసుకు రానుంది.

# బెంగలూరు తరహాలో కోకాపేట నిర్మాణాలు

హైదరాబాద్, జూలై 8, (న్యూస్ పల్స్)పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ, కమర్షియల్ హబ్ శరవేగంగా విస్తరిస్తోంది. అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెన్సీ నివేదికలు వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం.. కోకాపేట నియో-పోలిస్ ఫేజ్-2 లేఅవుట్లలో వాణిజ్య స్థలాల ధరలు చదరపు గజానికి ఎన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డు స్థాయి మార్కును తాకాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు లభిస్తున్న అనుమతులే ఇక్కడి భూములకు రెక్కలు రావడానికి ప్రధాన కారణం. ఒకప్పుడు బెంగళూరులోని ఎంజీ రోడ్ లేదా చెన్నైలోని ఓఎమ్ఆర్ ప్రాంతాలు దక్షిణాదిలోనే అత్యంత ఖరీదైన కమర్షియల్ స్థలాలుగా ఉండేవి. అయితే, గడిచిన కొద్దికాలంగా కోకాపేట పరిసర ప్రాంతాల్లో జరిగిన ప్రభుత్వ భూముల వేలం పాటలు , తాజా ప్రైవేట్ మార్కెట్ విశ్లేషణల ప్రకారం.. వాటన్నింటినీ వెనక్కి నెట్టి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఖరీదైన , అత్యున్నత స్థాయి వాణిజ్య హబ్‌గా కోకాపేట నియో-పోలిస్ అవతరించింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు ఇక్కడ తమ కార్యాలయాలను స్థాపించేందుకు పోటీ పడుతుండటంతో ల్యాండ్ వాల్యూస్ భారీగా పెరిగాయి. నియో-పోలిస్ లేఅవుట్ ప్రత్యేకత ఏమిటంటే.. ఇక్కడ ఎలాంటి ఎత్తు పరిమితులు లేకుండా వందలాది అంతస్తులతో స్కై స్క్రాపర్ భవనాలను నిర్మించుకునే వెసులుబాటు ఉంది. దీనికి తోడు 100 నుండి 150 అడుగుల వెడల్పు గల ట్రంక్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , పవర్‌లైన్ నెట్‌వర్క్, ఔటర్ రింగ్ రోడ్డుకు నేరుగా ఉన్న కనెక్టివిటీ వంటి మల్టీ-బిలియన్ డాలర్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇక్కడి భూములకు తిరుగులేని డిమాండ్‌ను తెచ్చిపెట్టాయి. ఈ వారం నమోదైన రికార్డు ధరలు పశ్చిమ హైదరాబాద్ శివార్ల రియల్ ఎస్టేట్ సామర్థ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్ కు చాటిచెప్పాయి. ఈ స్థాయి రేట్లు కేవలం కమర్షియల్ ల్యాండ్స్ కే పరిమితం కాకుండా.. పరిసరాల్లోని నార్సింగి, గండిపేట, పుప్పాలగూడ వంటి మైక్రో-మార్కెట్లలోని రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు, లగ్జరీ విల్లాల ధరలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ తారాస్థాయికి.. భగ్గుమన్న ముడిచమురు ధరలు




అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇక ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో ఇవాళ చమురు ధరలు ఆరు శాతానికిపైగా ఎగబాకాయి. పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 6.52 శాతం (4.69 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు దాదాపు 80 డాలర్ల వద్దకు చేరింది. అదేవిధంగా అమెరికా బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (టిఐ) ధర కూడా 6 శాతం (4.85 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు 75 డాలర్ల సమీపంలో ట్రేడయ్యింది. ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా తమ సైన్యం రాత్రికిరాత్రి ఇరాన్‌పై కొత్త దాడులు చేసిందని ఆయన తెలిపారు. "నా వరకు ఇరాన్‌తో ఒప్పందం ముగిసిపోయింది. వాళ్లతో ఇకపై చర్చలు జరపను. వాళ్లు రోగగ్రస్తులు, హింసావాదులు. అణుబాంబు దొరికితే దాన్ని వాడటానికి కూడా వెనుకాడరు. వాళ్లతో చర్చలు జరపడం అంటే సమయం వృథా చేసుకోవడమే. వాళ్లు అబద్ధాల కోరులు" అంటూ ఇరాన్ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిణామం భారత మార్కెట్లపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ముడి చమురు ధరల పెరుగుదలతో మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 1,900 పాయింట్లు (2 శాతానికి పైగా) నష్టపోయి 76,259 వద్ద ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా దాదాపు 600 పాయింట్లు పతనమై 23,805 వద్ద నిలిచింది.

## తుమ్మిడిహట్టి అగ్రిమెంట్ బయటపెడితే నేను రాజీనామాకు రెడీ.. రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్



తుమ్మిడిహట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తు పెంచడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నట్లు అగ్రిమెంట్ ఉందన్నవ్ కదా.. దమ్ముంటే ఒకవేళ అగ్రిమెంట్ ఉంటే బయటపెట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాలు విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తుమ్మిడిహట్టి విషయంలో అగ్రిమెంట్ బైట పెడితే నేను రాజీనామాకి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అగ్రిమెంట్ లేకుంటే రాజకీయాల కోసం అబద్ధం మాట్లాడిన అని తప్పయిందని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. తుమ్మిడిహట్టి నిర్మిస్తామని మ్యానిఫెస్టోలో చెప్పారు. కాంగ్రెస్ వచ్చి రెండున్నర సంవత్సరాలు అయింది. వీళ్ల మానిఫెస్టోలో తుమ్మిడి హట్టి కడతం అన్నరు. అయితే రెండున్నరేళ్లలో ఒక్కసారి కూడా మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇస్తలేదా..? లేదా డ్రామాలు ఆడుతున్నారా..? అని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే నేను నెలలోపు వెళ్లి కలిసిన. కాంగ్రెస్ ఓడిపోయి బీజేపీ గెలిస్తే ప్రభుత్వం వచ్చిన 10 రోజులకే వెళ్లి కలిశనని హరీశ్ రావు అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్రలో రెండు రోజులు ఉండి వెయిట్ చేసి ముఖ్యమంత్రి ఎప్పుడు టైమిస్తే అప్పటిదాకా నేను ఇక్కడనే ఉంటానని ఆయన టైం ఇచ్చినప్పుడు కలిసి బతిమిలాడి వచ్చిండు. 6 నెలల్లో కేసీఆర్ పోయిండు.. మా ఇంజనీర్లు పోయిన్రు. నేను మూడు నాలుగు సార్లు పోయిన. మరి మీరు రెండున్నర సంవత్సరాల్లో మీరు పోయింది కూడా లేదు.. అంటే మీది డ్రామా కంపెనీ. రెండున్నరేళ్లలో మీరు కనీసం తుమ్మిడిహట్టి కోసం ఒక్కసారైనా మహారాష్ట్రకు పోయిన్రా.. రెండు సంవత్సరాల 7 నెలలు పూర్తయింది.. అది మీ కమిట్‌మెంట్‌కు నిదర్శనం.. మా నిజాయితీ ఇది. మేం గవర్నమెంట్ వచ్చినకొత్తలోనే పోయినం. మరి మీరు ఈ రెండు సంవత్సరాల 7 నెలలు ఎందుకు పోలేదు. ఏం చేస్తిరని ప్రశ్నించారు. మాకు ప్రభుత్వం వచ్చిన నెల రోజులకే అపాయింట్‌మెంట్ ఇచ్చారు.. మీరు కనీసం ప్రయత్నమైనా చేస్తున్నారా..? అని అడిగారు.

## సొంత పార్టీ నాయకులపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ అనుచరులు దాడి

సూర్యాపేట, కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ అనుచరులు సొంత పార్టీ నేతలపై దాడికి దిగారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్గంపై కర్రలతో దాడి చేశారు. ఈ నేపథ్యంలో సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్‌పై ఫిర్యాదు చేయడానికి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్గీయులు గాంధీ భవన్కు బయలుదేరారు. అర్వపల్లి మండల కేంద్రంలో వీరి బలెరో వాహనాన్ని అపి మందుల సామేల్ వర్గం రాళ్లు, కర్రలతో దాడి చేశారు. దాడిలో కాంగ్రెస్ నాయకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. కొంతమంది పోలీసులకు కూడా గాయాలు కావడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు.

# ఎన్నికల విజయంపై న్యాయపోరు.. సీఎం విజయ్‌కు కొత్త చిక్కులు

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత సి.జోసెఫ్ విజయ్‌కు మరో కొత్త సవాలు ఎదురైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టీవీకే విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మద్రాస్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే గెలుపును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ మేరకు స్పందించింది న్యాయస్థానం. సీఎం విజయ్, కేంద్ర ఎన్నికల సంఘం మూడు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది. అలాగే సదరు పిటిషన్లపై కొన్ని ప్రక్రియాపరమైన అంశాలనూ లేవనెత్తుతూ, వాటిని సరిదిద్దుకోవాలని జస్టిస్ వి.లక్ష్మీనారాయణన్ ధర్మాసనం సూచించింది. పెరంబూర్‌లో విజయ్ చేతిలో ఓడిన డీఎంకేకు చెందిన ఆర్‌డీ.శేఖర్, అదే నియోజకవర్గానికి చెందిన దినేశ్, లక్ష్మీనరసింహన్ అనే మరో ఇద్దరు



ఓటర్లతో కలిసి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తిరుచ్చి ఈస్ట్ ఫలితాన్ని సవాల్ చేస్తూ డీఎంకేకు చెందిన ఎస్.ఇనిగో ఇరుదయరాజ్ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. విజయ్ ఎన్నికల ప్రచారంలో చిన్నారులను భావోద్వేగపూరితంగా ఉద్దేశించి, వారి ద్వారా కుటుంబ సభ్యుల ఓట్లను ప్రభావితం చేసేలా ప్రసంగించారని ఆరోపించారు. ఇది ఎన్నికల ప్రచారంలో చిన్నారులను వినియోగించరాదన్న ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొన్నారు. సాక్ష్యంగా చెన్నైలోని వైఎంసీఏ మైదానంలో ఏప్రిల్ 21న విజయ్ ప్రచార ప్రసంగానికి సంబంధించిన వీడియోలను సమర్పించారు. అదేవిధంగా ప్రచార గీతాల రూపకల్పనకు సంబంధించిన ఖర్చులను ఎన్నికల వ్యయంలో చూపలేదని, ఆస్తుల అఫిడవిట్‌లో ఆదాయపు పన్ను బకాయిల వివరాల్లోనూ వ్యత్యాసాలున్నాయని పిటిషనర్లు ఆరోపించారు. అలాగే ఏప్రిల్ 19న సెయింట్ ఆంటోనీ చర్చిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారన్న అంశాన్నీ ప్రస్తావించారు. మరోవైపు.. విల్లివాక్కం ఎమ్మెల్యే, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఆధవ్ అర్జున్ ఎన్నికల విజయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పైనా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అలాగే తిరువణ్ణామలై ఎమ్మెల్యే ఈవీ.వేలు, టీవీకేలో చేరిన మాజీ డీఎంకే ఎమ్మెల్యే ఎస్.జయకుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్యే తర్గై కుత్‌బర్ట్ ఎన్నికల విజయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా న్యాయస్థానం వారికి నోటీసులు పంపింది. కొందరు ప్రతివాదులు జులై 21లోపు తమ సమాధానాల్ని తెలపాలని ఆదేశించింది.

# బద్రీనాథ్ విరాళాల చోరీ వివాదం.. ఆలయ సిబ్బందిపై వేటు..

బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకలపై దర్యాప్తు చేయడానికి శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (బీకేటీసీ) నలుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం నుంచే ఈ కమిటీ దర్యాప్తును మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలోనే శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ ఓ సిబ్బందిపై వేటు వేసింది. విరాళాలు చోరీ చేశాడన్న ఆరోపణల కారణంగా అతడిని విధుల నుంచి సస్పెండ్ చేసింది. దీనిపై బీకేటీసీ ఛైర్మన్ హేమంత్ ద్వివేదీ స్పందిస్తూ.. 'ప్రైవేట్ సెక్రటరీగా పని చేసే ప్రమోద్ నౌటియాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశాం. ప్రాథమిక దర్యాప్తులో విరాళాల విషయంలో అతడు అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది' అని పేర్కొన్నారు. ఇక, సస్పెండ్ అయిన ప్రమోద్ నౌటియాల్‌పై మంగళవారం రాత్రి బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదైంది. అతనిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 306, 316(5) కింద కేసులు నమోదు అయ్యాయి. ఆలయ విరాళాల వివాదంపై మరో వైపు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఆదేశాల మేరకు



ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటైంది. ఈ హై-లెవల్ కమిటీకి గర్వాల్ డివిజనల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ నాయకత్వం వహిస్తున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ తివారీ, మెడికల్ హెల్త్ సర్వీసెస్ ఫైనాన్స్ డైరెక్టర్ జగత్ సింగ్ చౌహాన్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. బద్రీనాథ్ ఆలయ విరాళాలు, కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఈ కమిటీని ఆదేశించారు.

## పదకొండేళ్ల బాలికపై హత్యాచారం కేసు.. నిందితుల్లో ఒకడు పోలీస్ ఎన్‌కౌంటర్లో హతం..!

పశ్చిమబెంగాల్ లోని బరుయ్‌పుర్ లో 11 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడు బుధవారం తెల్లవారుజామున పోలీసుల ఎన్‌కౌంటర్ లో మృతిచెందాడు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అతడిని తీసుకెళ్లగా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు



ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. ఓ పోలీసు వద్ద ఉన్న తుపాకీ లాక్కొని పారిపోవడానికి యత్నించడమే కాకుండా.. ఒక రౌండ్ కాల్పులు కూడా జరిపాడని పేర్కొన్నారు. దాంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా అతడికి బుల్లెట్ గాయాలయ్యాయని వెల్లడించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ కేసులో అతడు ప్రధాన నిందితుల్లో ఒకడని, బాలిక అదృశ్యమయ్యే ముందు ఆమెతో కలిసి ఉన్నట్లు సీసీటీవీ దృశ్యాల్లో గుర్తించినట్లు చెప్పారు. హత్యాచార ఘటనపై స్థానికుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. బాలిక మృతదేహం లభించిన కొద్ది గంటల్లోనే అనుమానంతో ఓ వ్యక్తిని స్థానికులు కొట్టిచంపారు. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు ఆరుగురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేశారు. మరోవైపు ఈ ఘటనపై 72 గంటల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి డీజీపీని ఆదేశించారు.

### ఇరాన్‌పై ట్రంప్ వ్యాఖ్యల ఎఫెక్ట్.. స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్టర్ల సంపద రూ.4 లక్షల కోట్లు ఆవిరి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ భారీగా పతనమయ్యాయి. పెరుగుతున్న ముడిచమురు ధరలు, బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, కొత్తగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా సెన్సెక్స్ నిఫ్టీ (ఔటిబిఐ) సూచీలు రెండు శాతానికి పైగా పతనమయ్యాయి. ఇవాల్టి ట్రేడింగ్ రెండో సెషన్‌లో మార్కెట్ల పతనం మరింత వేగవంతమైంది. ఇరాన్‌తో తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం 'ముగిసిపోయింది' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మార్కెట్లలో అమ్మకాల సునామీ వచ్చింది. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతాయనే ఆందోళనలు, ప్రపంచ ఇంధన సరఫరాలపై దాని ప్రభావం గురించిన భయాలు ఇన్వెస్టర్లను అమ్మకాలవైపు నడిపించాయి. మధ్యాహ్నం ట్రేడింగ్‌లో నిఫ్టీ దాదాపు 500 పాయింట్లు పడిపోగా, సెన్సెక్స్ 1,600 పాయింట్లకుపైగా నష్టపోయింది. దాదాపు అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ 50లోని 50 కంపెనీలకుగాను 45 నష్టాల్లో ట్రేడయ్యాయి. ఈ తీవ్రమైన నష్టాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.4 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.476 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. అంతకుముందు ఉదయం సెషన్‌లోనే మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 364 పాయింట్ల నష్టంతో 77,816 వద్ద, నిఫ్టీ 139 పాయింట్ల నష్టంతో 24,259 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఆయిల్ & గ్యాస్ సూచీ అత్యధికంగా నష్టపోయింది.

## టర్కీకి ఎఫ్-35 యుద్ధ విమానాలు.. నెతన్యాహూ ఆందోళన




అంకారా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఎఫ్-35 యుద్ధ విమానాల(ఈ-35 ఏవిబిబ)ను టర్కీకి అమ్మనున్నట్లు వెల్లడించారు. అయితే టర్కీపై ఉన్న ఆంక్షలను ముందుగా ఎత్తివేసేందుకు ప్రయత్నించనున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఎఫ్-35 విమానాలను అమ్మేందుకు లైన్ క్లియర్ చేయనున్నారు. టర్కీ పర్యటనలో ఉన్న ఆయన ఆ దేశ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డొగాన్‌తో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎఫ్-35 ఫైటర్ జెట్స్‌ను టర్కీ కొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2019లో రష్యా నుంచి ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను టర్కీ కొనుగోలుచేసింది. దీంతో టర్కీపై అమెరికా ఆంక్షలు పెట్టింది. అయితే ఈ ఆంక్షలను ఎత్తివేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. అయితే ఎఫ్-35 అమ్మకాలకు చెందిన తుది నిర్ణయాన్ని త్వరలో వెల్లడించనున్నట్లు ట్రంప్ చెప్పారు. టర్కీకి ఎఫ్-35 యుద్ధ విమానాలను అమ్మరాదు అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ అన్నారు. ఆ అమ్మకాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల పశ్చిమాసియాలో అధికార సమతుల్యత దెబ్బతింటుందని నెతన్యాహూ ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్‌తోనూ వ్యక్తిగతంగా ఈ విషయాన్ని పేర్కొన్నట్లు చెప్పారు. టర్కీని మిత్రదేశంగా అమెరికా భావించరాదు అన్నారు. ముస్లిం బ్రదర్‌హుడ్‌తో టర్కీకి లింకు ఉన్నదని, హమాస్‌కు ఆ దేశ అధ్యక్షుడు ఎర్డొగాన్ మద్దతు ఇస్తున్నారని, రికార్డు స్థాయిలో జర్నలిస్టులు, ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తున్నారని నెతన్యాహూ పేర్కొన్నారు. అమెరికాకు తగిన మిత్రదేశం టర్కీ కాదు అని నెతన్యాహూ ఆరోపించారు.


## 'ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'




దమ్మపేట, జులై 08 : పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని, ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా బుధవారం దమ్మపేట ఆటో అడ్డ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నా కేంద్ర ప్రభుత్వం దేశంలో ఇంధన ధరలను పెంచి వాహనరంగంపై, సామాన్య ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ఇలా ప్రజల జేబులు ఖాళీ చేస్తుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం మూలంగా రవాణా రంగం ఆటో, ట్రాలీ, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులు అదానీ, అంబానీ కోసం 4 లేబర్ కోడ్స్ ను అమలు చేస్తూ కార్మికుల పొట్ట కొడుతుందని విమర్శించారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్రీ బస్సు వల్ల వంద మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కారు ట్రావెల్స్, ఆటో, ట్రాక్టర్, లారీ వాహనాలకు గిరాకి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ తరుణంలో మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా ధరలు పెంచడం అన్యాయమన్నారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, రామకృష్ణ, విక్రమ్, కుటుంబరావు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, రాజు పాల్గొన్నారు.

## కుండపోత వర్షాలు.. పుణేలో కూలిన మూడు అంతస్తుల భవనం..

మహారాష్ట్రను ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణేలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడు అంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ (పిసిఎంసి) వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా



నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది. మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న పీసీఎంసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దింపారు.

# కాపు నేతల్లో పరుగు పందెం

కాకినాడ, జూలై 8, వైసీపీ కాపు సామాజికవర్గం నేతల్లో పోటీ ఎక్కువ కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో గెలవడమే కాకుండా పార్టీ అధికారంలోకి వస్తే తమకు కేబినెట్ పదవి దక్కుతుందన్న భావన చాలా మందిలో వ్యక్తమవుతుంది. అందుకే వైసీపీ లో ఇప్పుడు కాపు సామాజికవర్గం నేతల వాయిస్ మాత్రమే గట్టిగా వినిపిస్తుంది. మిగిలిన సామాజికవర్గం నేతలు పెద్దగా కనిపించడం లేదు. గతంలో మంత్రులుగా పనిచేసిన రెడ్డి, ఎస్.సి, ఎస్టీ, కమ్మ సామాజికవర్గం నేతలు కూడా వైసీపీ తరుపున బయటకు వచ్చి మాట్లాడటం లేదు కానీ.. కాపు సామాజికవర్గం నేతలు మాత్రం హైలెట్ కావడానికి విపరీతంగా ప్రయత్నిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం వచ్చే ఎన్నికల్లో గెలిస్తే పదవి కోసమేనన్న కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తుందివైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కాపు సామాజికవర్గం నేతలకు జగన్ తన కేబినెట్ లోఅవకాశం కల్పించారు. బొత్స సత్యనారాయణ, కన్నబాబు, అంబటి రాంబాబు, పేర్ని నాని, ఆళ్ల నాని వంటి వారు మంత్రి పదవిని జగన్ మంత్రివర్గంలోపొందారు. ఆళ్ల నాని పార్టీ నుంచి వెళ్లిపోయినా మిగిలిన నేతలుమాత్రం పార్టీలోనే ఉండిపోయారు. ఎవరూ ఇతర పార్టీల్లోచేరేందుకు కూడా ప్రయత్నించలేదు. సహజంగా జనసేన లోకి వెళ్లాల్సిన నేతలు కూడా వైసీపీలోనే ఉండిపోయారు. ఇక వెళ్లే అవకాశం కూడా లేకపోవచ్చు. అయితే ఇదే సమయంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీ కాపు నేతల్లోనే పదవి కోసం రేసు మొదలయినట్లు కనిపిస్తుంది. గత కొన్ని రోజులుగా చూసిన వారికి ఎవరికైనా ఇదే భావన అనిపించక మానదు. . వైసీపీ ఓటమి పాలయి పదకొండు సీట్లకే పరిమితమయిన తర్వాత కాపు నేతలే ఎక్కువ గళం విప్పుతున్నారు. ఇక ఇటీవల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా హైలెట్ కావడానికి ప్రయత్నిస్తున్నారు. తోట త్రిమూర్తులు సీనియర్ నేత. అందుకే ఆయన ఇటీవల తన ఇలాకాలో వైసీపీ కాపు నేలత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జగన్ దృష్టిలో పడేందుకు ప్రయత్నించారు. అందులో తోట త్రిమూర్తులు సక్సెస్ అయ్యారనే చెప్పాలి. ముద్రగడ పద్మనాభం వంటి నేతలు అనారోగ్యంతో బాధపడుతుండటంతో తోట త్రిమూర్తులు కాపు సామాజికవర్గాన్ని వైసీపీకి దగ్గర చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద వైసీపీలో ఇతర సామాజికవర్గాల కంటే కాపు సామాజికవర్గం నేతల హడావిడే ఎక్కువగా కనిపిస్తుంది. మరి కాపు నేతల్లో ఎవరు రేసులో ముందుంటారన్నది కాలమే తేల్చాల్సి ఉంది.అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు రాజకీయ వైరాగ్యం వచ్చింది. ఆయన గత ఎన్నికల్లో తాను పోటీ చేసి తప్పు చేశానని బాధపడుతున్నారు. నిజానికి తాను గెలిచి తప్పు చేశానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనడం ఏపీ రాజకీయాలకు అద్దం పడుతుంది. నిజానికి మండలి బుద్ధ ప్రసాద్ సౌమ్యుడు. ఆయన ఎవరినీ నొప్పించరు. ఒకరిని మాట తూలే వ్యక్తి కాదు. నాయకుల్లో విభిన్నమైన నేతగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కు పేరుంది. ఆయన తండ్రి మండలి వెంకట కృష్ణారావు నుంచి నేర్చుకున్న రాజకీయ పాఠాలు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ను రాజకీయంగా ఇంత వరకూ తీసుకు వచ్చాయి.తెలుగు భాషను కాపాడుకోవడం కోసం దశాబ్ద కాలం నుంచి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

అలాగే నియోజకవర్గంలోఆయనకు మంచి పేరుంది. అవినీతి, ఆరోపణలకు దూరంగా ఉంటారు. ఆయన రాజకీయ జీవితంలో ఇప్పటి వరకూ చిన్న మచ్చ లేదు. కాకుంటే ఒకటే. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అనేక పార్టీలుమారారు. కాంగ్రెస్ లోఉన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తర్వాత టీడీపీలోచేరారు. 2014 లోటీడీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నాడు శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా పనిచేశారు. అయితే గత ఎన్నికలకు ముందు ఆయనకు టిక్కెట్ ఇబ్బందికరం కావడంతో జనసేనలోకి మారారు. ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే అవనిగడ్డ నియోజకవర్గంలో సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు ఆయన ఎదుర్కొంటున్నారు బహుశ అదే ఆయనను బాధించి ఉండవచ్చంటున్నారు. తనకన్నా రాజకీయంగా తక్కువ అనుభవం ఉన్న నేతలతో పాటు వయసు కూడా తక్కువ ఉన్న వారు తనను విమర్శించడం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తట్టుకోలేకపోతున్నారు. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కూడా వ్యక్తిగత విమర్శలకు వేదికగా మారడం ఆయనను మరింత బాధించినట్లుంది. అందుకే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తాను రాజకీయాల్లో ఎందుకున్నానో అనిపిస్తోందని వ్యాఖ్యానించారు.ఈసారి ఎమ్మెల్యేగా గెలవడమే పెద్ద తప్పు చేశానని మండలి బుద్ధప్రసాద్ అన్నారంటే ఎంత వేదన చెందారో అర్థం చేసుకోవచ్చు. దిగజారిన రాజకీయ విలువలను చూసి రోజూ బాధపడుతున్నానని మండలి బుద్ధప్రసాద్ అన్నారంటే అందుకు గల కారణాలు నేటి తరం రాజకీయ నేతలు తెలుసుకోవాల్సి ఉంటుంది.

# పవన్ హోమ్ మంత్రి..?

విజయవాడ, జూలై 8,ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు హాట్ టాపిక్ అవుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో అనుచిత ప్రవర్తనను అదుపు చేయాలనే ఉద్దేశంతో ఉన్న ప్రభుత్వం ఉగ్రవాదులపై ప్రయోగించే ఉపా చట్టాన్ని వాడుకోవడం సంచలనంగా మారింది. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గతంలో ఎప్పుడూ ఇంత కఠిన నిర్ణయాలు తీసుకోలేదని, ఇప్పుడు సాధారణ కేసులలో కూడా విపరీతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని చర్చ జరుగుతోంది. చంద్రబాబు ఇలా మారడానికి కారణాలు ఏమైవుంటాయని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని, అందుకే సీఎం కూడా తన ప్రసంగాల్లో పవన్ పై జరుగుతున్న దాడిని ప్రస్తావిస్తూ తన ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలకు వివరిస్తున్నారని అంటున్నారు. దేశ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేత అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశ్చర్యకరంగా పవన్ ప్రభావంతో నిర్ణయాలు తీసుకోవడం ఏంటి? అన్నదే ప్రస్తుతం పొలిటికల్ సర్కిల్స్ లో విస్తృత చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే ముందు వంద సార్లు ఆలోచించే చంద్రబాబు, తన 4.0 సర్కారులో మాత్రం కొన్ని అంశాల్లో జోరు చూపిస్తుండటమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. ఇందులో ప్రధానంగా సోషల్ మీడియా కేసుల విషయంలో చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రత్యర్థులను కూడా విస్మయానికి గురిచేస్తున్నాయని చెబుతున్నారు.రాష్ట్రానికి నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న చంద్రబాబుకు తొలి రెండు విడతలు సాఫీగా సాగిపోయాయి. అప్పట్లో సోషల్ మీడియా ప్రభావం లేకపోవడంతో చంద్రబాబు రాజకీయాలు ఒక మోస్తరుగా సాగిపోయేవి అని చెబుతున్నారు. అయితే 2014లో మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాక సోషల్ మీడియా నుంచి ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న చంద్రబాబు అధికారంలో ఉన్నంత వరకు అవేవీ తనను ఇబ్బంది పెట్టే సమస్యగా భావించలేదని అంటున్నారు. దీంతో అప్పట్లో అంటే 2014-19 మధ్య చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలో పనిచేసిన వారిపై సోషల్ మీడియాలో ఎంతలా దాడి చేసినా పెద్దగా పట్టించుకోలేదని, పోలీసు కేసులు కూడా పెద్దగా పెట్టలేదని అంటున్నారు. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఈ పరిస్థితిలో పూర్తి మార్పు కనిపిస్తోందని చెబుతున్నారు 2024 జూన్ లో అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నాళ్లు సోషల్ మీడియా పోస్టులపై ఉదాసీనంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ స్ట్రాంగ్ రియాక్షన్ తో కేసుల నమోదుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. తనతోపాటు కుటుంబ సభ్యులపైన అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై పోలీసులు కనీస చర్యలు తీసుకోలేదని పవన్ అసంతృప్తి వ్యక్తం చేసిన తర్వాత వరుసపెట్టి కేసులు నమోదు చేయడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురిని అరెస్టు చేయడం గమనిస్తే ప్రభుత్వంపై పవన్ ఒత్తిడి ఎక్కువగానే ఉందన్న విషయం అర్థమవుతోందని అంటున్నారు. ప్రస్తుతం యూట్యూబర్ రావణ్ అరెస్టు ముందు కూడా 'తాను హోంమంత్రి అయితే' అంటూ పవన్ సోషల్ మీడియా కార్యకర్తలను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఆ తర్వాత రావణ్ అరెస్టు జరగడం, వరుసగా బెయిలు వస్తున్న దశలో ఉపా చట్టం ప్రయోగించడం చూస్తే ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి ఉందనే విషయం అర్థమవుతోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తన మిత్రుడిని కాపాడుకోవడం కోసం సీఎం చంద్రబాబు ఇంతటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడమే అంతుచిక్కడం లేదని అంటున్నారు. నాన్చుడు ధోరణితో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తారని, ప్రతివిషయాన్ని భూతద్దంలో చూస్తారని టీడీపీ కార్యకర్తలు సైతం విమర్శిస్తుంటారని చెబుతారు. కానీ, పవన్ విషయంలో చంద్రబాబు నాన్చుడు ధోరణికి స్వస్తి చెప్పడమే కాకుండా, ఆఘమేఘాలపై నిర్ణయాలు తీసుకోవడం, యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం చూస్తే ఉప ముఖ్యమంత్రికి ప్రభుత్వంలో ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థమవుతోందని అంటున్నారు. అయితే ఇలాంటి కఠిన నిర్ణయాలు ప్రభుత్వానికి మంచి చేస్తాయా? లేదా? అన్న విషయమై సీఎం ఆలోచన చేస్తున్నారో? లేదో? కూడా తెలియడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# గోదావరి జిల్లాలకు జగన్

రాజమండ్రి, జూలై 8,వైసీపీ అధినేత వైఎస్ జగన్ చాలా కాలానికి ఆ ప్రాంతానికి వెళ్తున్నారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చేసే సత్తా కలిగిన ప్రాంతం అది. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమికి మొత్తానికి మొత్తం సీట్లు పట్టం కట్టి వైసీపీకి జీరో మార్కులు వేసిన కీలక రాజకీయ స్థావరమది. రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు అయిన గోదావరి జిల్లాలలో తమ పర్యటనకు జగన్ శ్రీకారం చుడుతున్నారు. జగన్ ఇప్పటిదాకా రెండేళ్ళ కాలంలో అడపా దడపా పరామర్శలు చేశారు. ఎక్కువగా క్రిష్ణా గుంటూరులలోనే ఆయన పర్యటనలు సాగాయి. మధ్యలో విశాఖ దాకా



వచ్చారు. అయితే జగన్ తొలిసారి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతానికి వస్తున్నారు వారితో కలసి ఆందోళన : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జగన్ పర్యటన ఈ నెల 15న ఉండబోతోంది. ఆక్వా రైతులను పరామర్శించి వారి సాధక బాధలను వినేందుకు జగన్ వస్తున్నారు అని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మధ్యనే ఆక్వా రైతులు తమ సమస్యలను జగన్ కి తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కలసి తెలియచేశాయి. ఆ సమయంలో వారికి అండగా ఉంటూ వైసీపీ పోరాటం చేస్తుందని జగన్ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే జగన్ పర్యటన భీమవరంలో పెట్టుకున్నారు అని అంటున్నార్. ఆక్వా రైతులను టీడీపీ కూటమి ప్రభుతం రెండేళ్ళ కాలంలో ఆదుకోలేదని వైసీపీ విమర్శిస్తోంది. సిండికేట్ యాజమాన్యాలు దళారులు కుమ్మక్కు అయి ఫీడ్ రేట్లు భారీగా పెంచేసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆక్వా రైతులు ఆందోళనలో ఉన్నారని వైసీపీ నేతలు అంటున్నారుఇదిలా ఉంటే ఫీడ్ రేట్లు కొంత తగ్గించినా ఇంకా ఆక్వా రైతులు ఇబ్బందులలోనే ఉన్నారు అని అంటున్నారు. దాంతో ఆక్వా రైతులను స్వయంగా కలసి వారి సాధక బాధకాలను జగన్ వింటారు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఈ సందర్భంగా ఆక్వా రైతులను ఆదుకునేందుకు వైసీపీ తరఫున కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉందని అంటున్నారు. వ్యూహం ఇదేనా : ఇదిలా ఉంటే గోదావరి జిల్లాలు వైసీపీని 2024 ఎన్నికల్లో పూర్తి స్థాయిలో దెబ్బేశాయి. దాంతో వైసీపీ అధికారంలోకి రావడం పక్కన పెడితే ప్రతిపక్షంలోకి కూడా వచ్చేందుకు అవసరమైన సీట్లు అందుకోలేకపోయింది. ఈ క్రమంలో రెండేళ్ళ పాలన తరువాత జగన్ గోదావరి బాట పట్టారు అని అంటున్నారు. పోయిన చోటనే వెతుక్కోవాలన్నది రాజకీయ జీవులు చెప్పే మాట. ఆ విషయంలో వైసీపీ అధినాయకత్వం కూడా సరైన దారి ఇదే అని గోదావరి జిల్లాలా బాట పడుతోంది అని అంటున్నారు. ఆక్వా రైతుల సమస్యలనే ఆయుధంగా చేసుకుని కూటమి ప్రభుత్వం మీద గట్టిగానే పోరాటం చేయాలన్నది వైసీపీ ఆలోచనగా చెబుతున్నారు. మరి రాక రాక చాలా కాలానికి భీమవరం వస్తున్న జగన్ కి ఏ విధమైన రిసీవింగ్ ఉంటుంది, వైసీపీకి గోదావరి పల్స్ ఏ విధంగా చిక్కుతాయన్నది వేచి చూడాల్సి ఉంది.

# దళిత క్రైస్తవ సామాజికవర్గం చుట్టూ రాజకీయ చదరంగం

ఏలూరు, జూలై 8,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఎన్నికల ముగింపు తర్వాత కూడా తెరవెనుక సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో సుమారు 15% నుండి 18% వరకు బలంగా ఉంటూ, దశాబ్ద కాలంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత నమ్మకమైన, సహజ సిద్ధమైన ఓటు బ్యాంక్‌గా ఉన్న దళిత క్రైస్తవ సామాజికవర్గం చుట్టూ ఇప్పుడు సరికొత్త రాజకీయ చదరంగం నడుస్తోంది. మొన్నటివరకు జగన్ మోహన్ రెడ్డికి ఏకపక్షంగా అండగా నిలిచిన ఈ వర్గానికి తానే ఏకైక లీడర్నని, రక్షకుడినని చెప్పుకుంటూ జై భీమ్ భారత్ పార్టీ అధినేత, లాయర్ జడ శ్రవణ్ కుమార్ రంగంలోకి దిగారు. గత ఎన్నికల్లో మంగళగిరితో పాటు పలు స్థానాల్లో సొంతంగా అభ్యర్థులను నిలబెట్టి ఓట్లు చీల్చిన శ్రవణ్.. ఇప్పుడు ఏకంగా తానే దళిత క్రైస్తవుల ప్రత్యామ్నాయ డిప్యూటీ సీఎం అనే రేంజ్‌లో బిల్డప్ ఇస్తూ చేస్తున్న రాజకీయం ఢిల్లీ స్థాయి దాకా చర్చనీయాంశమైంది.రాజకీయ నిపుణుల లోతైన విశ్లేషణ ప్రకారం.. జడ శ్రవణ్ కుమార్‌కు అత్యంత స్పష్టమైన, సుదూర రాజకీయ లక్ష్యాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవుల నిరసన సభలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ఆయన చేసిన తీవ్రమైన వ్యాఖ్యలు దీనికి స్పష్టమైన ఉదాహరణ. పవన్ కల్యాణ్ కాపు సామాజికవర్గానికి డిప్యూటీ సీఎం అయితే.. నేను దళిత క్రైస్తవ సామాజికవర్గానికి డిప్యూటీ సీఎంను అనే తరహాలో శ్రవణ్ క్లెయిమ్ చేసుకోవడం వెనుక.. జగన్ మోహన్ రెడ్డి ఇమేజ్‌ను పక్కనబెట్టి, సదరు ఓటు బ్యాంక్‌ను తన స్వంత అకౌంట్‌లోకి మార్చుకోవాలనే మైండ్ గేమ్ స్పష్టంగా కనిపిస్తోంది. అదే సమయంలో జోసఫ్ రావణ్‌కు మద్దతుగా జడ శ్రవణ్ పని చేశారు. ఇక్కడే వైసీపీ ఊహించని పెద్ద పొలిటికల్ షాక్ తగలనుంది. జోసఫ్ రావణ్, జడ శ్రవణ్ కుమార్ వంటి వారు పవన్ కల్యాణ్‌ను, కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తుంటే.. వైసీపీ అనుకూల మీడియా వీరికి విపరీతమైన కవరేజ్ ఇస్తూ ప్రమోట్ చేస్తోంది. కూటమిని ఇబ్బంది పెట్టడానికి వీరు పనికొస్తారని జగన్ మోహన్ రెడ్డి భావిస్తుండవచ్చు. కానీ, పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్న నిజం ఏంటంటే.. వీరిని ఎంతగా ప్రోత్సహిస్తే అంతగా వైకాపాకే భారీ నష్టం వాటిల్లుతుంది. ఎందుకంటే, దళిత క్రైస్తవ సమాజంలో ఒక కొత్త లీడర్‌గా జడ శ్రవణ్ కుమార్ ఎస్టాబ్లిష్ అయితే.. మొదట ఖాళీ అయ్యేది వైసీపీ ఓటు బ్యాంక్ అని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఏపీలో దళిత, మైనారిటీ వర్గాలు వైసీపీ ఐదేళ్ల పాలనలో తమకు జరిగిన అన్యాయాలు, నిధుల మళ్లింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని గత ఎన్నికలు నిరూపించాయి. జగన్ మోహన్ రెడ్డి కేవలం ఓట్ల కోసమే తమను వాడుకున్నారనే భావన క్రైస్తవ పెద్దలలో బలంగా నాటుకుంటోంది. అందుకే గత ఎన్నికల్లో కొంత మంది కాంగ్రెస్ కు ఓటు వేశారు. ఇలాంటి తరుణంలో జడ శ్రవణ్ కుమార్ రూపంలో ఒక దూకుడున్న దళిత న్యాయవాది, క్రైస్తవ హక్కుల రక్షకుడిగా ప్రచారం పొందితే.. ఆ వర్గాల యువత వైసీపీని వదిలేసి జై భీమ్ భారత్ పార్టీ వైపు మళ్లే అవకాశాలు 100 శాతం ఉన్నాయి. అంటే, కూటమిని దెబ్బతీయడానికి వాడుతున్న ఆయుధమే.. చివరికి వైసీపీ పునాదులనే తవ్వేసే ప్రమాదం ఉంది.వైసీపీ అనుసరిస్తున్న ఈ విధానం కచ్చితంగా భస్మాసుర హస్తం లాంటిదేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జోసఫ్ రావణ్ అరెస్ట్‌ను, ఉపా కేసులను బూచిగా చూపిస్తూ జడ శ్రవణ్ కుమార్ చేస్తున్న సెంటిమెంట్ పాలిటిక్స్ వల్ల.. వైసీపీ తన సొంత ఓటు బ్యాంక్‌పై నియంత్రణ కోల్పోతోంది. పవన్ కల్యాణ్ ఐడెంటిటీని ఎదుర్కొనే క్రమంలో, వైసీపీకి ప్రత్యామ్నాయంగా దళిత క్రైస్తవ సమాజానికి జడ శ్రవణ్‌ను లీడర్‌గా మార్చే ఈ వ్యూహం.. రాబోయే 2029 ఎన్నికల నాటికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆయా సామాజికవర్గాల్లో మూడో స్థానానికి పడిపోయేలా చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

# హైదరాబాద్ లో కార్మిక మంత్రి ప్రజా దర్బారు

విజయవాడ, జూలై 8,సాధారణంగా ఒక రాష్ట్రానికి చెందిన మంత్రులు తమ సొంత నియోజకవర్గాలు లేదా జిల్లా కేంద్రాల్లో ప్రజా దర్బార్‌లు నిర్వహించి సమస్యలను పరిష్కరించడం మనం చూస్తుంటాం. కానీ, ఏపీ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సరికొత్త సంప్రదాయానికి తెరలేపారు. పక్క రాష్ట్రమైన హైదరాబాద్‌లో ఏకంగా ప్రజా దర్బారుతోపాటు జాబ్ మేళా నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించారు. హైదరాబాద్‌లో బిక్షపతి యాదవ్ కళ్యాణ మండపంలో మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా మంత్రి సుభాష్ వినూత్నంగా ఈ కార్యక్రమం నిర్వహించారని అంటున్నారు. సాధారణంగా వృత్తి, వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిన లక్షల మంది ఏపీ వాసులు తమ సొంత రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన సేవలు, పరిష్కారాల కోసం చాలా ఇబ్బందులు పడుతుంటారు. చిన్నచిన్న పనుల కోసం హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు వెళ్లి ఆ పనులు చేయించుకునేందుకు వ్యయప్రయాసలకు గురవుతుంటారు. ఇలాంటి వారి కోసం మంత్రి సుభాష్ చేసిన ప్రయోగం అభినందనలు అందుకుంటోంది. సహజంగా ఎన్నికల సమయంలో ఓటర్లు ఎక్కడ ఉంటే నేతలు అక్కడకు క్యూ కడుతుంటారు. అదేవిధంగా ప్రజలకు పాలన చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటిస్తుంటారు. కానీ, తమ ప్రాంత ప్రజల కోసం పక్క రాష్ట్రంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం నిజంగా అభినందనీయమే అంటున్నారు. పక్క రాష్ట్రంలో ఒక మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించడం రాజకీయంగా ఒక వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. తమ ప్రాంతీయులు ఎక్కడ ఉన్నా వారికి అండగా ఉంటామనే సంకేతాన్ని పంపడం ద్వారా మంత్రి తన సొంత నియోజకవర్గంలో క్రేజ్ పెంచుకునే ఎత్తుగడ అమలు చేశారని అంటున్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే మంత్రి సుభాష్ ప్రజాదర్బార్, జాబ్ మేళా అంటూ హడావుడి చేస్తున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఏది ఏమైనా, హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ వేడిని పెంచడమే కాకుండా, ప్రజా రవాణా, సంక్షేమ పథకాలపై కూడా చర్చను రేకెత్తించింది, తన ప్రజాదర్బార్ కార్యక్రమానికి లభించిన విశేష స్పందనను చూసి మంత్రి వాసంశెట్టి సుభాష్ సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోనే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నగరాల్లో నిర్వహించే అవకాశం ఉందని ఆయన సంకేతాలిచ్చారు.

# జడ శ్రవణ్ డబ్బులెలా వస్తున్నాయి..

## కలకలం రేపుతున్న వీడియో

గుంటూరు, జూలై 8, నిజమే.. మీరు చదివింది ముమ్మాటికి నిజమే. ఇదేదో మేము చేస్తున్న ఆరోపణ కాదు. నేను కావాలని స్ప్రెడ్ చేస్తున్న ఫ్యాబ్రికేటెడ్ న్యూస్ అంతకంటే కాదు. ఈ విషయాన్ని స్వయంగా జడ శ్రావణ్ చెప్పారు. అది రికార్డు అయింది. యూట్యూబ్ ద్వారా బయటికి వచ్చింది. రకరకాల చర్చలకు కారణమైంది. అంతేకాదు, జడ శ్రవణ్ అసలు రంగు బయటపడుతోంది.కొద్దిరోజులుగా ఏపీ రాజకీయాలలో జడ శ్రవణ్ గురించి పెద్ద ఎత్తున చర్చ నడుస్తుంది కదా.. పైగా ఆయన ఓ మీటింగ్లో పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి.. పది ఫెయిల్ అయిన నువ్వు డిప్యూటీ సీఎం అవ్వంగా లేంది.. జడ్జి చదువుకున్న నేను డిప్యూటీ సీఎం కాకూడదా అంటూ ప్రశ్నించారు. వాస్తవానికి జడ్జి అనేది ఒక చదువు కాదు. అది ఒక ఉద్యోగం మాత్రమే. అనుభవం ద్వారానే అది ఇస్తారు. ఆ విషయాన్ని మర్చిపోయి శ్రవణ్ మాట్లాడారు. జనసేన నాయకుల చేతిలో తీవ్రస్థాయిలో విమర్శలకు గురయ్యారు. జడ శ్రవణ్ ఎప్పుడైతే ఆ విమర్శ చేశారో.. అప్పట్నుంచి జన సైనికుల చేతిలో తీవ్రస్థాయిలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జడ శ్రవణ్ గురించి జనసేన నాయకులు కొత్త కొత్త వీడియోలు బయటపెడుతున్నారు.జనసేన నాయకులు బయటపెట్టిన వీడియోలలో ఒకటి మాత్రం సంచలనం కలిగిస్తోంది.

# వివాదంలో పులవర్తి...


తిరుపతి, జూలై 8 : తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేలు కట్టుబాటు తప్పుతున్నారు. ఆడియో లీకులు, వీడియోలు విడుదలవుతాయని తెలిసి కూడా కొందరు ఎమ్మెల్యేలు ఆవేశంతో చేస్తున్న పనులు పార్టీకి రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారు. ఇటీవల చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆడియో సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఒక కాంగ్రెస్ నేతతో భూ వివాదంపై రిటైర్డ్ జడ్జిపై బూతు పురాణం సంచలనంగా మారింది. వంద కోట్ల విలువైన భూమి విషయంలో తలెత్తిన వివాదమే ఈ ఫోన్ కాల్ సారాంశం. అయితే గత వైసీపీ ప్రభుత్వంపై ఎలాంటి ఆరోపణలు టీడీపీ అధినేత చంద్రబాబు చేశారో అదే తప్పిదం ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ కనపడుతున్నాయి. దీంతో రెండు ప్రభుత్వాలకు పెద్దగా తేడా ఏముందన్న ప్రశ్నలు జనాల్లో మెదులుతున్నాయి.పులివర్తి నాని తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అదీ చంద్రబాబు తొలిసారి పోటీ చేసి రాజకీయాల్లోకి వచ్చిన చంద్రగిరి నియోజకవర్గంలో గెలిచి సత్తా చాటారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ టీడీపీకి గెలుపు దక్కలేదు. అలాంటి నియోజకవర్గంలో 2024లో పులివర్తి నాని ఆ బ్యాడ్ రికార్డును బద్దలు కొట్టి అందరి దృష్టిలో పడ్డారు. అక్కడ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గత కొన్ని ఎన్నికలుగా గెలుస్తూ వస్తున్నారు. చంద్రగిరి తన అడ్డాగా చెవిరెడ్డి భావించారు. అలాంటి చోట గెలిచిన పులివర్తి నాని చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. అయితే ఈ భూ వివాదంలో ఎందుకు ఇరుక్కున్నారన్నది ఇప్పటికీ టీడీపీ నాయకత్వానికి అర్థం కాని ప్రశ్నగానే ఉండిపోయింది. చంద్రబాబు, లోకేశ్ కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడినపులివర్తి నాని చంద్రగిరిలో తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేయాల్సి ఉంది.కానీ పులివర్తి నాని తొలిసారి గెలిచిన తర్వాత వివాదాల్లో చిక్కుకోవడం ఇప్పుడు పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. ఒక కుటుంబానికి చెందిన భూమిని రికార్డులు తారుమారు చేసి ఆక్రమించారంటూ ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ స్థలం తమదేనని పులివర్తి నాని వర్గీయులు వాదిస్తున్నారు. తిరుపతిలో కూటమి రెండేళ్ల పాలన విజయోత్సవ సభవిజయవంతం కావడం చూసి ఓర్వలేక కొందరు ఇలా పులివర్తి నానిపై కుట్రలు పన్నుతున్నారని కూడా వారు ఆరోపిస్తున్నారు. కానీ అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. ఒక వృద్ధ దంపతులు మీడియా ముందుకు రావడం, రిటైర్డ్ ఆర్డీవో కూడా ప్రెస్ మీట్ పెట్టి మరీ విషయాలను వెల్లడించడంతో టీడీపీకి ఇబ్బందికరంగా మారింది. చంద్రబాబు సొంత జిల్లాలోనే భూ వివాదాలకు టీడీపీ నేతలు కేరాఫ్ గా మారుతుండటం కొంత పార్టీకి ఇబ్బందికరమైన పరిణామమేనని సీనియర్ నేతలు కూడా అంటున్నారు. మరి రానున్న కాలంలో ఎలాంటి పరిణామాలు జరుగుతాయన్నది చూడాలి.

# అన్ని వంటనూనెల కన్నా ఇదే ది బెస్ట్ కుకింగ్ ఆయిల్!




ఆరోగ్యంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారంతో పాటు మనం వాడే వంట నూనె విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. ఏం వంట నూనె ఉపయోగిస్తే మంచిది అనేది తెలుసుకోవాలి. ప్రస్తుతం మనం రైస్ బ్రాన్ ఆయిల్ గురించి తెలుసుకుందాం. రైస్ బ్రాన్ ఆయిల్, ఇతర వంట నూనెలతో పోలిస్తే, దాని పోషక గుణాల వల్ల చాలా ఎక్కువ మంది దీనిని వాడుతున్నారు. రైస్ బ్రాన్ ఆయిల్ తో ఆరోగ్య ప్రయోజనాలు బియ్యం గింజల పై పొర నుండి తీసిన ఈ నూనెలో యాంటీఆక్సిడెంట్లు, ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో మోనోఅన్‌సాచురేటెడ్, పాలీఅన్‌సాచురేటెడ్, సాచురేటెడ్ కొవ్వులు సరైన నిష్పత్తిలో ఉండటం వల్ల ఇది వంటకు మరింత ఆరోగ్యకరమైన ఎంపికగా మారుతుంది.ఈ నూనెలో ఒరిజానాల్ అనే సమ్మేళనం అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఒరిజానాల్ రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె ఆరోగ్యానికి కూడా దోహదం చేస్తుంది. రైస్ బ్రాన్ ఆయిల్ తో వంట లకు సహజ రుచి రైస్ బ్రాన్ ఆయిల్ లో విటమిన్ ఇ ఉంటుంది, ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తూ కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. రైస్ బ్రాన్ ఆయిల్ వేయించడం, బేకింగ్ వంటి అనేక వంట పద్ధతులకు చాలా అనుకూలంగా ఉంటుంది. దీని రుచి చాలా మృదువుగా ఉంటుంది. వంటకాలపై ఎటువంటి ప్రభావం చూపదు. పైగా, రైస్ బ్రాన్ ఆయిల్ పదార్థాల సహజ రుచిని మరింత పెంచడానికి సహాయపడుతుంది. ఈ ఆయిల్స్ తో పోలిస్తే రైస్ బ్రాన్ ఆయిల్ బెస్ట్ ఇది అతి తక్కువ ధరలో మన గుండెకు ఆరోగ్య ప్రయోజనాలను అందించే నూనె.ఆలివ్ ఆయిల్ తో పోలిస్తే, రైస్ బ్రాన్ ఆయిల్ ధర తక్కువ. కొబ్బరి నూనెలా కాకుండా, ఇందులో కొవ్వుల నిష్పత్తి మెరుగ్గా ఉంటుంది, ఇది శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో ఒరిజానాల్ వంటి సమ్మేళనాలు ఉండవు. కనుక సన్ఫ్లవర్ ఆయిల్, ఆలివ్ ఆయిల్ తో పోల్చి చూస్తే రైస్ బ్రాన్ ఆయిల్ మంచిది. ఆరోగ్యానికి , పర్యావరణానికి మేలు చేసే ఆయిల్ రోజువారీ వంటకాల్లో రైస్ బ్రాన్ ఆయిల్ ను వాడటం వల్ల రుచి గానీ, నాణ్యత గానీ తగ్గకుండా పోషక విలువలను పెంచుకోవచ్చు. ఇది మన ఆరోగ్యానికి దోహదం చేయడమే కాకుండా పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. ధాన్యం పొట్టు వ్యర్థాలతో తీసే ఈ నూనె పర్యావరణ పరిరక్షణలోనూ భాగస్వామ్యం తీసుకుంటుంది.

# గట్ హెల్త్ కు బెస్ట్ ఫుడ్స్ – ఎన్నో సమస్యలకు పరిష్కారం..!!



ఆరోగ్యం గా ఉండాలంటే శరీరానికి పోషకాలు అవసరం. మనం తీసుకునే ఆహారం జీర్ణమై శరీరానికి శక్తిని ఇవ్వటంలో జీర్ణ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తోంది. కడుపు ఆరోగ్యం బాగుంటేనే శరీరం పూర్తి ఫిట్ గా.. అన్ని రకాల శక్తి అందుతుంది. ఏ మాత్రం జీర్ణవ్యవస్థ సక్రమంగా లేకపోయినా.. శరీరం లో ఎన్నో సమస్యలు మొదలవుతాయి. జీర్ణవ్యవస్థ బాగుండాలంటే గట్ ఆహారం చాలా అవసరం. దీని ద్వారా పూర్తిగా జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేస్తుంది. జీర్ణ క్రియను మెరుగు పర్చేందుకు కొన్ని ఫుడ్స్ ను తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.జీర్ణవ్యవస్థను గట్ అని కూడా పిలుస్తారు. ఇది కడుపు, ప్రేగులు మరియు పెద్దప్రేగులను కలిగి ఉంటుంది. జీర్ణవ్యవస్థ సరిగ్గా పని చేయకపోవటానికి అనేక కారణాలు ఉంటాయి. అందులో అధిక యాంటీ బయోటిక్స్ వినియోగం.. ఒత్తిడి.. నిద్ర లేకపోవటం.. శారీరక వ్యాయామ లేమి.. ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవటం వంటివి కారణాలుగా చెబుతున్నారు. ఆరోగ్యకరమైన గట్ నిర్వహణ కోసం పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ళు, బీన్స్, గింజలు, తృణధాన్యాలు వంటివి అవసరం. ఎక్కువగా ఫైబర్ ఆహారం జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. పప్పులు, గింజలు, ధాన్యాలు లేదా గింజలు వంటి ఎంపిక చేసిన కూరగాయల వేరియంట్‌లలో లభించే ప్రీబయోటిక్ ఫైబర్‌ల నుండి గట్ ఆరోగ్యం చాలా వరకు ప్రయోజనం పొందవచ్చు. పండ్లు మరియు కూరగాయల ద్వారా శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు మరియు ఆరోగ్యాన్ని ఇచ్చే పదార్థాలు లభిస్తాయి.తిరుమల కొండకు ఉచిత ప్రయాణం, పరిమితం – ఇక ఫ్రీ బస్సులో ఇవి తప్పనిసరి..!!ర్ణవ్యవస్థలో ప్రేగులకు నీరు తప్పనిసరి. ఇది ఆహారాన్ని జీర్ణం చేయడంతో పాటు పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది మరియు మలాన్ని మృదువుగా చేస్తుంది. మూలికలు, సుగంధ ద్రవ్యాలు, రంగు రంగుల పండ్లు మరియు కూరగాయలు, గింజలు మరియు గింజలు, గ్రీన్ – బ్లాక్ టీ, కాఫీ, కోకో మరియు డార్క్ చాక్లెట్ వంటి పాలీఫెనాల్స్ అధికంగా ఉండే ఆహారాలు గట్ మైక్రోబయోమ్ కు మేలు చేస్తాయి. పెరుగు, కిమ్చి, సౌర్‌క్రాట్, కేఫీర్, కొంబుచా మరియు టేంపే వంటి పులియబెట్టిన ఆహారాలు జీర్ణ ఆరోగ్యంకు ప్రయోజనకరం. ధ్యానం, నడక, తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం. వీటి ద్వారా జీర్ణ వ్యవస్థను బలోపేతం చేసుకుంటే.. శరీరం బలంగా.. ఆరోగ్యంగా ఉంటుంది. ఇతరత్రా సమస్యల పరిష్కారానికి మేలు చేస్తుంది.



# డయాబెటిస్ పేషెంట్స్ రాగిజావ ఎక్కువగా తాగుతున్నారా?

డయాబెటిస్.. ఇప్పుడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి. ప్రతి పదిమందిలో ఐదుగురు డయాబెటిస్ బాధితులు ఉంటున్నారంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. డయాబెటిస్ ను పట్టించుకోకపోతే మనకు తెలియకుండానే మన ప్రాణాలను హరిస్తుంది. డయాబెటిస్ తో బాధపడేవారు మందులు తీసుకోవడంతో పాటు ముఖ్యంగా లైఫ్ స్టైల్ చేంజ్ చేసుకోవడం చాలా అవసరం. అన్నానికి బదులుగా రాగిజావ తినే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించడం, ప్రతిరోజు వ్యాయామం చేయడం, యోగ సాధన చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రతిరోజు ఏడు నుండి ఎనిమిది గంటల పాటు నిద్రపోవడం ఎంతో అవసరం. ఇక్కడ డయాబెటిస్ తో బాధపడేవారు డయాబెటిస్ ను కంట్రోల్ చేసుకోవడం కోసం చాలామంది అన్నానికి బదులుగా రాగిజావ ను తీసుకుంటున్నారు. రాగి జావతో డయాబెటిస్ బాధితులకు ప్రయోజనం కలుగుతుందా? అయితే రాగిజావ ని తీసుకోవడం మంచిదేనా? రాగి జావతో



డయాబెటిస్ బాధితులకు ప్రయోజనం కలుగుతుందా అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం.రాగులలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అంతేకాదు తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. అటువంటి రాగులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడతాయి. రాగులలో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణక్రియ మందగిస్తుంది. మధుమేహం ఉన్నవారికి ఇది మేలు చేస్తుందా? ఇది రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరగడానికి సహాయపడుతుంది. కాబట్టి ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుందని చెప్పవచ్చు. ఇక్కడ చెక్కర స్థాయిలను వేగంగా రాగులు పెంచకపోవడం వల్ల, మధుమేహం ఉన్నవారు నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. అయితే రాగిజావ ని తీసుకోవడంలో ఒక ప్రమాదం కూడా ఉంది. రాగి జావను మితంగా తీసుకుంటే అది మన బ్లడ్ షుగర్ లెవల్స్ ను కంట్రోల్ చేస్తుంది. మోతాదు కంటే ఎక్కువగా తీసుకుంటే డేంజర్ రాగి జావ ని తీసుకుంటే ఏమి కాదు అన్న ఉద్దేశంతో దానిని మోతాదు కంటే ఎక్కువగా తీసుకుంటే మళ్లీ అది మన బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగడానికి కారణమవుతుంది. పచ్చ జొన్నలు, సజ్జలు, కొర్రలు, ఒంద్రు కొర్రలు వంటి వాటితో పోల్చి చూస్తే రాగులు కాస్త త్వరగా షుగర్ లెవెల్స్ పెంచుతాయని చెప్పవచ్చు. రాగిజావ తీసుకోవాలంటే ఇలా చెయ్యండి కాబట్టి రాగిజావ ని తీసుకోవాలనుకునే వారు మితంగా తీసుకుంటే మంచిది. మీ ఆహారంలో మీరు రాగిజావ ను చేర్చాలి అనుకుంటే, మీ డయాబెటిస్ కు సంబంధించి చికిత్స తీసుకుంటున్న వైద్య నిపుణులతో సంప్రదించి ఆయన సూచన మేరకు తీసుకోవడం మంచిది.

# ఒత్తిడి ఉపశమనం, ప్రశాంతమైన నిద్ర.. ఈ ఒక్కటి ట్రై చెయ్యండి!

వంటింట్లో వెల్లుల్లిని చాలా ప్రధానంగా భావిస్తాము. నిత్యం మనం చేసే వంటలలో కూడా వెల్లుల్లి పాత్ర చాలా ఉంటుంది. వెల్లుల్లిలో మన శరీరానికి ఆరోగ్యాన్నిచ్చే అనేక మంచి గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా వెల్లుల్లి నిద్రలేమి లక్షణాలను తగ్గించడంలో ఎంతగానో సహాయం చేస్తుంది. ఇటీవల జరిగిన అధ్యయనాలు వెల్లుల్లి యొక్క సహజ సమ్మేళనాలు నిద్ర నాణ్యతను మెరుగుపరచగలవని సూచిస్తున్నాయి. నిద్ర సమస్యలతో బాధపడుతున్న అనేక మంది వెల్లుల్లి తో నిద్రలో మెరుగుదలను చూసినట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. వెల్లుల్లి ప్రయోజనాలు వెల్లుల్లిలో విటమిన్లు అ, ః6, మాంగనీస్, మరియు కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్లు ఇ, ఐ వంటి అనేక ఖనిజాలు ఉంటాయి. ఇది కాకుండా, వెల్లుల్లిలో అల్లిసిన్ వంటి శక్తివంతమైన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ



ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటాయి. వెల్లుల్లిలో అలిసిన్ ఉంటుంది. ఇది వ్యాధినిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. మన ఇళ్ళలో ఉండే ఈ చిన్నగింజల్లో నూరు ఆరోగ్య ప్రయోజనాలు” వెల్లుల్లితో నిద్ర నాణ్యత.. అధ్యయన ఫలితాలు ఈ లక్షణాలు నిద్రలేమికి సాధారణ కారణాలైన ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించడంలో సహాయపడవచ్చు. అదనంగా, వెల్లుల్లి యొక్క యాంటీఆక్సిడెంట్లు మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహించగలవు, ఇది మెరుగైన నిద్రని ఇస్తుంది. అధ్యయనం ప్రకారం నిద్ర వ్యవధి మరియు నాణ్యతను మెరుగుపరచడంలో వెల్లుల్లి గణనీయమైన పాత్రను కలిగి ఉంది. రాత్రివేళ ఆహారంలో వెల్లుల్లిని చేర్చిన తర్వాత నిద్రపోయేవారు తక్కువ అంతరాయాలతో ఎక్కువ సేపు నిద్ర పోయారు.. అమృతం విషం” రాత్రి పడుకోబోయే ముందు వెల్లుల్లి మంచి నిద్రనిస్తుంది కనుక వెల్లుల్లి మన నిద్రకు దోహదం చేసే గొప్ప గుణాలు కలిగి ఉందని నమ్మవచ్చనే అభిప్రాయం ఉంది. రోజువారీ భోజనాలలో వెల్లుల్లిని చేర్చడం మంచిది. మన ఆరోగ్యానికి ఇది ఒక ఖర్చు తక్కువ విధానం. ఇది వివిధ వంటకాలలో వివిధ రకాలుగా ఉపయోగించవచ్చు. ఆహారంలో భాగంగా దీనిని తీసుకోవడం నిద్రకు మాత్రమే కాదు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలిగిస్తుంది.ఏది ఏమైనా రాత్రి పడుకోబోయే ముందు వెల్లుల్లిని తీసుకోవడం మంచి నిద్రకు దోహదం చేస్తుందని అధ్యయనం నిద్రలేమితో బాధపడే వారికి ఒక మంచి శుభవార్త చెప్పినట్టే భావించాలి.

# నిమ్మకాయ గింజలను తినొచ్చా... తింటే ఏమవుతుంది?

నిమ్మ గింజలలో ఫుల్ పోషకాలుఅయితే చాలామంది నిమ్మకాయలను వివిధ రకాలుగా ఆహారంలో భాగంగా చేయడానికి ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో వారు అందులో ఉండే నిమ్మ గింజలను పడేస్తూ ఉంటారు. కానీ నిమ్మ గింజలలో కూడా మన శరీరానికి ఉపయోగపడే బోలెడన్ని పోషకాలు ఉంటాయని వీటిని పారేయకుండా ఉంటేనే మంచిదని పలువురు చెబుతున్నారు. ఇక నిమ్మ గింజలతో మనకు ఎటువంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి తదితర వివరాలను ప్రస్తుతం తెలుసుకుందాం.నిమ్మ గింజలతో ఆరోగ్యంనిమ్మకాయ లోనే కాదు నిమ్మకాయ గింజలలో కూడా మంచి పోషకాలు ఉంటాయి. నిమ్మకాయ గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్ సి వంటి ముఖ్యమైన పోషకాలు మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. నిమ్మకాయ గింజల్లో ఉండే ఫ్లేవనాయిడ్ లు, విటమిన్ సి వంటి యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. నిమ్మకాయ గింజల్లో ఉండే ఫైబర్ కారణంగా మన జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.నిమ్మ గింజలతో ఈ ప్రయోజనాలు కూడానిమ్మకాయ గింజలు మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. మన చర్మ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం లోను, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ నిమ్మ గింజలు ఎంతగానో దోహదం చేస్తాయి. మూత్రపిండాల్లో రాళ్ళను నివారించడానికి, ఐరన్ శోషణకు నిమ్మకాయ గింజలు దోహదం చేస్తాయి. నిమ్మ గింజలు గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. ఇవి మన శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి బాగా తగ్గిస్తాయి.ఖనీజూజూఎ బవవటబ: ఈ చిన్నగింజలు చేసే మాయతో ఒత్తిడి మాయం, సుఖ నిద్ర ఖాయం!నిమ్మ గింజలను ఇలా తీసుకోకూడదుఅంతేకాదు బరువు తగ్గడానికి కూడా నిమ్మ గింజలు దోహదం చేస్తాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను నివారించడంలోనూ, నిమ్మ గింజలు కొన్ని రకాల బ్యాక్టీరియాను నివారించడానికి, ఫంగల్ ఇన్ఫెక్షన్ నుంచి కాపాడడానికి ఉపయోగపడతాయి. కాకుంటే నిమ్మ గింజలను అతిగా తీసుకోకూడదు, మితంగా తీసుకుంటే నిమ్మ గింజలు కూడా మంచి ప్రయోజనాలనే ఇస్తాయి.



# స్పోర్ట్స్ న్యూస్

## ఈజిప్ట్ కోచ్ వర్సెస్ మెస్సీ.. మైదానంలో తీవ్ర ఉద్రిక్తత..

అట్లాంటా: ఫిఫా వరల్డ్‌కప్‌లో అనూహ్య రీతిలో అర్జెంటీనా 3-2 గోల్స్ తేడాతో ఈజిప్ట్‌పై గెలిచిన విషయం తెలిసిందే. ఓ దశలో 0-2 గోల్స్ తేడాతో వెనుకబడ్డ అర్జెంటీనా.. ఆఖరి నిమిషాల్లో ప్రత్యర్థిని స్టన్ చేసింది. అయితే మ్యాచ్ ముగిసిన సమయంలో.. ఈజిప్ట్ కోచ్ హోసమ్ హసన్, అర్జెంటీనా కెప్టెన్ లియోనిల్ మెస్సీ(మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మైదానంలోని టచ్‌లైన్ వద్ద .. ఈజిప్ట్ కోచ్ దూకుడుగా ప్రవర్తించారు. మిగితా కోచింగ్ సిబ్బంది




కూడా మెస్సీపై దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే ఆ కోచింగ్ స్టాఫ్ వ్యక్తికి రెడ్‌కార్డ్ జారీ చేశారు. అర్జెంటీనా స్టన్నింగ్ రీతిలో నెగ్గడంతో.. మైదానంలో నాటకీయ పరిణామం చోటుచేసుకున్నది. ఈజిప్ట్ కోచ్ హసన్ ఓ దశలో తన చేతులతో ఓ విభిన్నమైన సంకేతాన్ని చేశారు. అర్జెంటీనా ప్లేయర్ మెస్సీపై దూసుకెళ్లే ప్రయత్నం చేస్తూ.. తన చేతులను చీ తరహాలో క్రాస్‌లో పెట్టి నిరసన వ్యక్తం చేశాడు. మెస్సీని ఉద్దేశిస్తూ ఈజిప్ట్ కోచ్ నిరసన వ్యక్తం చేయడంతో.. అక్కడే ఉన్న ఫిఫా మ్యాచ్ అఫీషియల్స్ అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ఘటనకు చెందిన వీడియోలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ఫైనల్ విజిల్ తర్వాత టచ్‌లైన్ వద్ద ఉన్న హసన్ దిశగా మెస్సీ వెళ్లాడు. అయితే ఆ ఇద్దరి మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో తెలియదు. కానీ ఈజిప్ట్ కోచ్ తన చేతులను చీ రూపంలో పెట్టి నిరసన వ్యక్తం చేశారు. మెస్సీపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లు ఈజిప్ట్ కోచ్‌పై ఆరోపణలు వస్తున్నాయి. అతనిపై ఫిఫా నియమావళి ప్రకారం చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆ ఘటనకు చెందిన ఆడియోను రిలీజ్ చేయలేదు. హసన్ ఇచ్చిన సంకేతం అర్థం కావడం లేదు అని ఫిఫా, ఈజిప్ట్ ఫుట్‌బాల్ సంఘం పేర్కొన్నది. మెస్సీ, హసన్ మధ్య గొడవ జరుగుతున్న సమయంలోనే ఈజిప్ట్ కోచింగ్ స్టాఫ్ అక్కడకు చేరుకున్నది. ఓ సభ్యుడు తన సహనాన్ని కోల్పోయి.. మెస్సీ మీదకు దూసుకెళ్లాడు. ఆ వెంటనే అర్జెంటీనా ప్లేయర్లు వచ్చి మెస్సీని చుట్టుముట్టారు. మ్యాచ్ అఫీషియల్స్, సెక్యూర్టీ సిబ్బంది కూడా చేరుకున్నారు.రెండు గోల్స్‌తో లీడింగ్‌లో ఉన్న ఈజిప్ట్ .. ఆఖరి నిమిషాల్లో షాక్ అయ్యింది. అర్జెంటీనా తేరుకుని వెంటవెంటనే గోల్స్ చేయడంతో ఈజిప్ట్ 3-2 తేడాతో ఖంగుతిన్నది. అయితే మ్యాచ్ రిఫరీలు అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఈజిప్ట్ ఆరోపించింది. భారీ అప్‌సెట్ తప్పదనుకున్న తరుణంలో.. మెస్సీ సేన అనూహ్య రీతిలో పరాభవం నుంచి గట్టెక్కింది. దీంతో ఈజిప్ట్ కోచ్‌తో సహా ప్లేయర్లు కూడా అర్జెంటీనాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తమకు అన్యాయం చేశారని ఈజిప్ట్ కోచ్ ఆరోపించారు. ఈ వరల్డ్‌కప్‌కు చెందిన మిగితా మ్యాచ్‌లను ఇక చూడబోనని ఈజిప్ట్ కోచ్ తెలిపారు.

## వైభవ్ సూర్యవంశీతో ఇప్పుడు స్కోర్ సమం అయింది: జోఫ్రా ఆర్చర్

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, ఇంగ్లండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ మధ్య ఆసక్తికర పోటీ మొదలైంది. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్‌లో ఒకే జట్టుకు ఆడిన ఈ ఇద్దరూ.. ఇప్పుడు భారత్?ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లో ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. మూడో టీ20 అనంతరం వైభవ్‌తో తన పోటీపై ఆర్చర్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.మాంచెస్టర్‌లో అరంగేట్ర మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ ఆర్చర్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది తన అంతర్జాతీయ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించాడు. ట్రెంట్ బ్రిడ్జ్‌లో జరిగిన మూడో టీ20లో కూడా ఆర్చర్ బౌలింగ్‌లో మరో రెండు సిక్సర్లు బాదాడు. అయితే ఈసారి చివరికి పైచేయి సాధించింది ఆర్చరే. ఐదు బంతుల్లో 13 పరుగులు చేసిన వైభవ్‌ను క్యాచ్ ఔట్ చేసి అతడి ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు. మ్యాచ్ అనంతరం ఈ పోటీ గురించి ఆర్చర్ మాట్లాడాడు. 'ఇప్పుడు మా ఇద్దరి మధ్య స్కోరు సమం అయింది. అతడు సిక్సర్లు బాదాడు.. నేను ఔట్ చేశాను. ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఏం జరుగుతుందో చెప్పలేం. చివరికి ఎవరు మెరుగ్గా రాణిస్తారో వారే విజేత అవుతారు' అంటూ యువ బ్యాటర్‌కు ఆర్చర్ సరదాగా సవాల్ విసిరాడు.ఇదిలా ఉండగా, ఇంగ్లండ్‌తో మూడో టీ20లో భారత్ ఘోరంగా విఫలమైంది. 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేవలం 76 పరుగులకే ఆలౌట్ అయి 125 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో




ఇంగ్లండ్ 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మూడు ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టిన ఆర్చర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇప్పుడు సిరీస్‌లో నిలవాలంటే భారత్ తప్పనిసరిగా నాలుగో టీ20లో విజయం సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురువారం బ్రిస్టల్ వేదికగా జరిగే మ్యాచ్‌లో ఓడితే సిరీస్ ఇంగ్లండ్ ఖాతాలో చేరనుంది.

## నా జీవితంలోనే అత్యుత్తమ పుట్టినరోజు కానుక ఇది: సౌరభ్ గంగూలీ

భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ 54వ పుట్టినరోజు నేడు. ఆయన జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'దాదా: ది సౌరభ్ గంగూలీ స్టోరీ'. గంగూలీ పుట్టినరోజు సందర్భంగా సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇందులో ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం బాల్కనీలో చొక్క విప్పి ఊపుతూ చేసుకున్న ఐకానిక్ సెలబ్రేషన్స్ ఫొటోను రీక్రియేట్ చేశారు. ఈ పోస్టర్‌పై గంగూలీ స్పందించాడు. తన జీవితంలోనే ఇది అత్యుత్తమ పుట్టిన రోజు కానుక అంటూ ఆనందం వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.జాతీయ అవార్డు గ్రహీత రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ బయోపిక్ వచ్చే ఏడాది మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ ఆవిష్కరణ అనంతరం గంగూలీ మాట్లాడాడు. 'పుట్టినరోజు ఎప్పుడూ ప్రత్యేకమే. కానీ నా బయోపిక్ ఫస్ట్ లుక్‌ను ఇదే రోజున విడుదల చేయడం ఈ రోజును మరింత చిరస్మరణీయంగా మార్చింది. ఇంతకంటే గొప్ప బహుమతి ఇంకొకటి ఉండదు. ఈ పోస్టర్ చూసిన వెంటనే నా కెరీర్‌లోని ఓ అద్భుతమైన క్షణం కళ్ల ముందు మెదిలింది. రాజ్‌కుమార్ రావు ఈ పాత్ర కోసం ఎంతో




నిబద్ధతతో సిద్ధమయ్యాడు. అతను నా ప్రయాణాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తాడనే నమ్మకం ఉంది. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. అభిమానులంతా థియేటర్లలో చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని గంగూలీ వెల్లడించాడు.గంగూలీ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పి గాల్లో ఊపుతున్న గంగూలీ ఐకానిక్ సెలబ్రేషన్‌ను రాజ్‌కుమార్ రావు అచ్చం అలాగే రీక్రియేట్ చేశాడు. బ్యాగౌండ్‌లో త్రివర్ణ పతాకం కనిపించేలా పోస్టర్‌ను డిజైన్ చేశారు. 2002 నాట్‌వెస్ట్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై భారత్ సాధించిన చిరస్మరణీయ విజయానంతరం గంగూలీ లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పి సంబరాలు జరుపుకోవడం భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఘట్టం. అదే సన్నివేశాన్ని ఈ బయోపిక్ ఫస్ట్ లుక్‌కు కేంద్ర బిందువుగా మలిచారు.భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా గుర్తింపు పొందిన గంగూలీ నాయకత్వంలో టీమిండియా విదేశాల్లోనూ అద్భుత విజయాలు నమోదు చేసింది. 2001లో ఆస్ట్రేలియాపై చరిత్రాత్మక టెస్టు సిరీస్ విజయం, 2002 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సంయుక్త విజేతగా నిలవడం, 2002 నాట్‌వెస్ట్ ట్రోఫీని గెలుచుకోవడం, 2003 ప్రపంచకప్ ఫైనల్‌కు భారత్‌ను చేర్చడం వంటి ఎన్నో చిరస్మరణీయ విజయాలు అతడి కెప్టెన్సీలోనే సాధ్యమయ్యాయి.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్: అగ్రస్థానాల్లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ

ఐసీసీ పురుషుల టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత యువ ఆటగాళ్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ తమ అగ్ర స్థానాలను నిలబెట్టుకున్నారు. తాజా ర్యాంకింగ్స్ అప్‌డేట్‌లో వీరిద్దరూ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. కాకపోతే..ఇప్పటి వరకు అగ్రస్థానంలో కొనసాగిన అభిషేక్ శర్మ రెండో స్థానంలోకి పడిపోయాడు. మరోవైపు, భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు ఘనమైన ఆరంభాన్ని అందుకోవడంతో ఆ జట్టు ఆటగాళ్లు తమ ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపర్చుకున్నారు.తొలి మ్యాచ్ వర్షం వల్ల రద్దు కాగా, ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన ఇంగ్లండ్ ప్రస్తుతం 2-0 ఆధిక్యంలో ఉంది. ముఖ్యంగా మూడో టీ20లో ఇంగ్లండ్ 125 పరుగుల రికార్డు విజయాన్ని నమోదు చేసింది. టీ20 ఫార్మాట్‌లో భారత్‌కు ఇదే అత్యంత భారీ ఓటమి కావడం గమనార్హం. రెండో టీ20లో 46 బంతుల్లో 76 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఇంగ్లాండ్‌ను గెలిపించిన జాకబ్ బెథెల్, ఏడు స్థానాలు ఎగబాకి బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 8వ స్థానానికి చేరుకున్నాడు.అలాగే ఆల్‌రౌండర్ సామ్ కరన్ మూడు విభాగాల్లోనూ మెరుగైన ర్యాంకులు సాధించాడు. రెండో మ్యాచ్‌లో 3/33 వికెట్లు తీసి, మూడో మ్యాచ్‌లో 41 పరుగులతో రాణించిన కరన్.. బ్యాటింగ్‌లో 108, బౌలింగ్‌లో సంయుక్తంగా 71, ఆల్‌రౌండర్ల జాబితాలో ఆరు స్థానాలు మెరుగుపరుచుకుని 13వ స్థానానికి



చేరుకున్నాడు. సీనియర్ లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ మూడో టీ20లో 2/14తో రాణించి బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి చేరాడు. తన రెండో టీ20లోనే 4 వికెట్లు తీసిన పేసర్ జోష్ టాంగ్ 301వ స్థానంతో ర్యాంకింగ్స్‌లోకి ప్రవేశించాడు. బంతితో రాణించిన విల్ జాక్స్ 6 స్థానాలు ఎగబాకి ఆల్‌రౌండర్ల విభాగంలో 7వ ర్యాంకుతో టాప్-10 లోకి దూసుకొచ్చాడు.

## గౌతమ్ గంభీర్ నిర్ణయంపై దినేష్ కార్తీక్ విమర్శలు



స్పోర్ట్స్ డెస్క్: ఇంగ్లండ్ చేతిలో టీమిండియాకు దారుణమైన పరాభవం ఎదురైంది. నాటింగ్‌హామ్ వేదికగా మూడో టీ20 మ్యాచ్‌లో 125 పరుగుల తేడాతో భారత్ ఓడిపోయింది. ఈ పరాజయంపై మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ స్పందించారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణమని అతడు విమర్శించాడు. మ్యాచ్ సమయంలో ఓ స్పోర్ట్స్ ఛానల్‌లో అతడు ప్రత్యక్ష ప్రసారంలో ఉండగా ఆగ్రహానికి గురై, దూబే కంటే ముందు రాణాను పంపాలన్న నిర్ణయంపై అసహనం వ్యక్తం చేశాడు. 'శివమ్ దూబే కంటే ముందు హర్షిత్ రాణా బ్యాటింగ్‌కు రావడమా, మీరు నన్ను ఆటపట్టిస్తున్నారా?' అని కార్తీక్ లైవ్‌లో అనడం వినిపించింది. 'దేశీయ క్రికెట్‌లో కూడా హర్షిత్ రాణా పవర్ ప్లేలో ఎప్పుడూ బ్యాటింగ్ చేసినట్లు చూడలేదు. టీ20ల్లో కుడి-ఎడమ కాంబినేషన్ కోసం మీరు ప్రయత్నించారు. కానీ, ఇది ఒక దశ వరకు మాత్రమే బాగుంటుంది. అంతేకానీ, దూబే స్థానంలో హర్షిత్ రాణా బ్యాటింగ్‌కు రావడం మాత్రం సరైన నిర్ణయం కాదు' అని దినేశ్ వ్యాఖ్యానించాడు. ఆరో డౌన్‌లో వచ్చిన హర్షిత్ 13 బంతుల్లో 9 పరుగులు చేశాడు. ఆ తర్వాత వచ్చిన దూబే (2) కూడా ఎక్కువసేపు నిలవలేదు.మరోవైపు టీమిండియా ఓడిపోవడంపై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో కామెంట్లు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా మేనేజ్‌మెంట్ తీరుపై ఫ్యాన్స్ విమర్శలు చేస్తున్నారు. గత ఐదు టీ20ల్లో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. ఇంగ్లండ్‌తో మూడో టీ20లోనూ బ్యాటింగ్ వైఫల్యం కొట్టొచ్చింది. బ్యాటర్లలో ఎవరూ బాధ్యత తీసుకోవడం లేదని ఫ్యాన్స్ కామెంట్లు చేశారు. 2009 తర్వాత ఇదే అత్యంత సుదీర్ఘమైన ఓటముల పరంపర కావడం గమనార్హం.

## విఫలమైనప్పటికీ జట్టులో మార్పులు వద్దు: అనిల్ కుంబ్లే

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియాకు మరో ఓటమి ఎదురైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన మూడో టీ20లో శ్రేయస్ అయ్యర్ సేన 125 పరుగుల తేడాతో ఘోరంగా ఓడింది. ఫలితంగా సిరీస్‌లో 0?2తో వెనుకబడింది. ఈ నేపథ్యంలో టీమిండియా ఆటగాళ్లతో పాటు యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తుదిజట్టులో తరచూ మార్పులే ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత స్పిన్ దిగ్గజం, మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే తన అభిప్రాయాలు పంచుకున్నాడు. ఓ స్పోర్ట్స్ షోలో అనిల్ కుంబ్లే మాట్లాడుతూ.. తుదిజట్టులో ఎలాంటి మార్పులు అవసరం లేదని తాను భావిస్తున్నానని, అలా చేస్తేనే జట్టులో ఆత్మవిశ్వాసం పెంపొందించగలరని అన్నాడు. ఇక తిలక్ వర్మ.. అతడు ఇప్పుడు వైస్ కెప్టెన్, అతడికి ఓ బాధ్యత అప్పగించారని, కాబట్టి అతడికి మరొక్క అవకాశం ఇవ్వాలని అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. మన బౌలర్లు కూడా తమ ఆట తీరును మార్చుకోవాల్సి ఉందని పేర్కొన్నాడు. టీమిండియా బౌలర్లు



ధారాళంగా పరుగులు ఇచ్చుకున్న చోట.. ఇంగ్లండ్ జట్టు మాత్రం 76 పరుగులకే ఆలౌట్ చేసిందని వెల్లడించాడు. ప్రణాళికలు, వ్యూహాలు పరిస్థితులకు తగ్గట్లుగా మార్చుకోవాలని అనిల్ కుంబ్లే హితవు పలికాడు. కాగా ఇంగ్లండ్‌తో తొలి టీ20లో 13 పరుగులు చేసిన తిలక్ వర్మ.. రెండో టీ20లో 24 (నాటౌట్) పరుగులతో ఫర్వాలేదనిపించాడు. అయితే, మంగళవారం నాటి మూడో మ్యాచ్‌లో మాత్రం 11 బంతులు ఎదుర్కొని మూడు పరుగులకే పెవిలియన్ చేరాడు.ఇదిలా ఉంటే.. తొలి టీ20లో ఆడిన సంజూ శాంసన్‌పై వేటు వేసిన మేనేజ్‌మెంట్.. అతడి స్థానంలో వైభవ్ సూర్యవంశీని కొనసాగిస్తోంది. ఇక రెండో టీ20లో విఫలమైన రవి బిష్ణోయ్‌ని తప్పించి.. అతడి స్థానంలో మూడో టీ20లో ప్రిన్స్ యాదవ్‌ను ఆడించింది. బ్రిస్టల్ వేదిక ఇరుజట్ల మధ్య గురువారం నాలుగో టీ20 జరగనుంది.

# సినిమా

## "హృదయం మురళి" అందరికీ రిలేట్ అయ్యే సినిమా : హీరో అథర్వా

అథర్వా, ప్రీతి ముకుందన్, కయదూ ప్రధాన పాత్రల్లో ఆకాష్ బాస్కరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం హృదయం మురళి. ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషించారు. అలాగే స్టార్ కంపోజర్ థమన్ ఎస్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందించడంతో పాటు కీలక పాత్రలో నటించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ చిత్రం జూలై 10న తెలుగులో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.



ప్రెస్ మీట్‌లో హీరో అథర్వా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. తెలుగు ప్రేక్షకులు చూపించే ఆదరణ చాలా అద్భుతం. నా గత చిత్రాలకు ఎంతో ప్రేమను అందించారు. 'హృదయం మురళి' స్పెషల్ సినిమా. ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడి పనిచేశాం. ఈ సినిమాలో నటించిన వారందరూ చాలా మంచి ఫ్రెండ్స్ అయ్యారు. ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న మైత్రి మూవీ మేకర్స్‌కు ధన్యవాదాలు. చాలా పెద్ద స్టార్ కాస్ట్ ఉన్న సినిమా ఇది. దర్శకుడు ఆకాష్ భాస్కరన్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. తమన్ గారు ఈ సినిమాకు సంగీతం అందించడంతో పాటు ఒక మంచి పాత్రలో కూడా నటించారు. ఆయనతో కలిసి నటించడం చాలా మంచి అనుభవం. ఫహాద్ ఫాజిల్ గారు కూడా ఈ సినిమాలో చాలా కీలకమైన పాత్ర పోషించారు. దర్శకుడిగా, నిర్మాతగా ఆకాష్ భాస్కరన్ ఈ సినిమాను ఎంతో అద్భుతంగా తెరకెక్కించారు. అలాగే మనోజ్ పరమహంస అద్భుతమైన విజువల్స్ అందించారు. ఈ సినిమా అందరూ రిలేట్ అయ్యే సినిమా. వన్‌సైడ్ లవర్స్ ఈ సినిమాతో చాలా కనెక్ట్ అవుతారు. ఈ సినిమా ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. ప్రతి ఒక్కరి మనసుకు దగ్గరగా ఉండే సినిమా ఇది. జూలై 10న సినిమా విడుదల అవుతోంది. అందరూ థియేటర్లకు వచ్చి చూడాలని కోరుకుంటున్నాను.

ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. 'హృదయం మురళి' సినిమా జూలై 10న థియేటర్లలో విడుదల అవుతోంది. అందరూ తప్పకుండా థియేటర్లకు వచ్చి చూడండి. ఇది హృదయాన్ని హత్తుకునే ప్రేమకథ. ఈ సినిమాలో మ్యూజిక్ చాలా బాగుంటుంది. రెండు గంటల పాటు మీకు మంచి వినోదాన్ని అందిస్తుంది. ఇందులో చాలా నాస్టాల్జిక్ మూమెంట్స్ ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని మేము నమ్ముతున్నాం."

సెల్వన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. 'డ్యూడ్' సినిమాలో నేను చేసిన పాత్రను తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. మైత్రి మూవీ మేకర్స్‌తో మరోసారి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. 'హృదయం మురళి' ప్రేమ, స్నేహం గురించి చెప్పే అద్భుతమైన సినిమా. తమన్ గారితో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాతో మా మధ్య మంచి స్నేహం ఏర్పడింది. తెలుగు ప్రేక్షకులు మంచి సినిమాలను ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా అదే విధంగా ఆదరిస్తారని నమ్ముతున్నాను."

మైత్రి శశి మాట్లాడుతూ.. ఈ సినిమాను మేము డిస్ట్రిబ్యూట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్, పాటలు చాలా బాగున్నాయి. గతంలో వచ్చిన 'హృదయం' ఎంత పెద్ద బ్లాక్‌బస్టర్ అయిందో, 'హృదయం మురళి' కూడా అంత పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం. కయాదుతో మేము గతంలో 'డ్రాగన్' సినిమా చేశాం. అది బ్లాక్‌బస్టర్ అయింది. ఇప్పుడు ఈ సినిమా విజయం సాధిస్తుంది. అలాగే తమన్ గారు సంగీతం అందించడంతో పాటు ఇందులో నటించడం కూడా ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణ. కచ్చితంగా ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం. జూలై 10న 'లెనిన్' సినిమా కూడా విడుదల అవుతోంది. ఆ సినిమాతో పాటు 'హృదయం మురళి' కూడా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. రెండు సినిమాలు కూడా బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకోవాలని ఆశిస్తున్నాం.

నటీనటులు: అథర్వా, ప్రీతి, కయాదు, ఫహాద్ ఫాజిల్, థమన్ ఎస్, నిహారిక, ద్రవిడ్, ఏంజెలిన్ , అంజు కురియన్, సుధాకర్, యశశ్రీ, జోనిత

## క్లైమాక్స్ దశలో వారణాసి.. సెట్స్‌పై మరో భారీ యుద్ధానికి సన్నాహాలు



భారతీయ సినిమా గురించి ప్రపంచవ్యాప్తంగా డిస్కషన్ జరిగినప్పుడు తప్పకుండా వినిపించే పేర్లలో ఎస్.ఎస్. రాజమౌళి ఒకరు. అంతర్జాతీయ వేదికలపై వరుస గౌరవాలు అందుకుంటూనే, మరోవైపు తన కొత్త ప్రాజెక్ట్ వారణాసిని పూర్తి చేసే దిశగా ఆయన వేగంగా అడుగులేస్తున్నారు. విదేశాల్లో ప్రశంసలు అందుకున్న వెంటనే మళ్లీ షూటింగ్‌పై పూర్తి దృష్టి పెట్టడం రాజమౌళి పని తీరుకు మరో ఉదాహరణగా మారింది. ప్రస్తుతం వారణాసి ప్రొడక్షన్ కీలక దశలోకి చేరింది. షూటింగ్ లో ఎక్కువ భాగం పూర్తవడంతో, మిగిలిన షెడ్యూళ్లను వేగంగా పూర్తి చేసేలా మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్‌కు కూడా తగిన సమయం కేటాయించేలా షెడ్యూలింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, ఇంటర్నేషనల్ రేంజ్ టెక్నికల్ వర్క్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్న నేపథ్యంలో, షూటింగ్ పూర్తయ్యాక కూడా దీర్ఘకాలిక పోస్ట్ ప్రొడక్షన్ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది. టార్గెట్ గా పెట్టుకున్న రిలీజ్ డేట్ కు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రతి దశను ముందుగానే ప్లాన్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రాబోయే షెడ్యూల్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. వేలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో రూపొందించనున్న భారీ యుద్ధ ఘట్టం ఈ షెడ్యూల్‌లో మెయిన్ ఎట్రాక్షన్ గా ఉండనుంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు తెరకెక్కిన అతిపెద్ద వార్ ఎపిసోడ్స్‌లో ఒకటిగా నిలిచేలా జక్కన్న దీన్ని రూపొందిస్తున్నారని సమాచారం. సెట్స్‌పై షూట్ చేసే ఈ సీన్ ను తరువాత అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లే ప్రణాళిక కూడా ఉందని తెలుస్తోంది. రాజమౌళి సినిమాల భారీ కాన్వాస్‌ను ఈ ఎపిసోడ్ మరోసారి గుర్తు చేయబోతోందనే అంచనాలు ఈ వార్ ఎపిసోడ్‌పై ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఫ్రాన్స్ పర్యటనలో రాజమౌళికి లభించిన గౌరవం భారతీయ సినీ పరిశ్రమకు మరో గుర్తింపుగా నిలిచింది. ఆయన సినిమాల స్పెషల్ స్క్రీనింగ్స్, సినీ స్టూడెంట్స్ మరియు ఆడియన్స్ తో నిర్వహించిన చిట్‌చాట్స్, మాస్టర్ క్లాసులకు వచ్చిన రెస్పాన్స్ ఇండియన్ స్టోరీలపై అంతర్జాతీయ ఆసక్తి ఎంతగా పెరిగిందో మరోసారి చూపించింది. తెలుగు భాషలో రూపొందిన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతున్నాయనే విషయానికి ఇది బలమైన నిదర్శనంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ం ప్రతిష్టాత్మక వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్ లో రాజమౌళి పేరు చేరడం కూడా ఆయన సినీ ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. ప్రపంచ సినీ రంగంలో విశిష్ట ముద్ర వేసిన డైరెక్టర్ల సరసన చోటు దక్కడం ద్వారా ఇండియన్ డైరెక్టర్ల ప్రతిష్ట మరింత పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా బాహుబలి: ది ఎటర్నల్ వార్ కు సంబంధించిన తాజా వివరాలను కూడా రాజమౌళి పంచుకోవడం అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది. ఒకవైపు వారణాసిని ముగింపు దశకు తీసుకెళ్తూనే, మరోవైపు బాహుబలి వరల్డ్ ను విస్తరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టమవుతోంది. దేశీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా ప్రపంచ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందుతున్న ఈ రెండు భారీ ప్రాజెక్టులు, భారతీయ సినిమా అంతర్జాతీయ స్థాయిని మరింత బలోపేతం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ''చెన్నై లవ్ స్టోరీ "టీమ్ సమక్షంలో ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ బర్త్ డే సెలబ్రేషన్స్

కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ బర్త్ డే సెలబ్రేషన్స్ ఈ రోజు హైదరాబాద్ ఎఫ్ ఎన్ సీసీ లో చెన్నై లవ్ స్టోరీ మూవీ టీమ్ సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం, ప్రొడ్యూసర్, డైరెక్టర్ సాయి రాజేష్, నిర్మాత ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ రవి నంబూరి, హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ తదితరులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ఎస్ కేఎన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా



ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ – మా మిత్రుడు ఎస్ కే ఎన్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలి. ఏడాదికి రెండు చిత్రాలు నిర్మించాలి. ఇండస్ట్రీకి మంచి హిట్ సినిమాలు అందించాలి. అన్నారు.

హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ – ఎస్ కేఎన్ గారు ఇలాగే ప్రతి పుట్టినరోజు హ్యాపీగా జరుపుకోవాలి. మరెన్నో మంచి చిత్రాలు నిర్మించాలి. ఆ చిత్రాల్లో మాలాంటి వాళ్లకు అవకాశాలు కల్పించాలని కోరుకుంటున్నా. అన్నారు.

డైరెక్టర్ సాయి రాజేష్ మాట్లాడుతూ – నా మిత్రుడు ఎస్ కేఎన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ రోజు ఆయన బర్త్ డే సెలబ్రేషన్స్ జరుగుతున్నాయి. ఈ నెల 24న చెన్నై లవ్ స్టోరీతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని ఎస్ కేఎన్ కు బర్త్ డే గిఫ్ట్ ఇస్తాం. అన్నారు.

హీరో అరుణ్ ఆదిత్ మాట్లాడుతూ – మనం మంచి మూవీస్ చేద్దాం డార్లింగ్ అని ఎస్ కేఎన్ గతంలోనే చెప్పేవారు. ఆయన చెప్పినట్లే మంచి మూవీస్ చేస్తున్నారు. ఎస్ కేఎన్ ఇంకా గ్రాండ్ బర్త్ డే ఈవెంట్స్ జరుపుకోవాలని కోరుకుంటున్నా. ఆయన నిర్మించిన చెన్నై లవ్ స్టోరీ మూవీ ఘన విజయం సాధించాలి. అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – ఎస్ కేఎన్ గారు ప్రతి బర్త్ డే ను ఇలాగే గ్రాండ్ జరుపుకోవాలి. ఆయన నుంచి మరిన్ని సక్సెస్ ఫుల్ మూవీస్ రావాలి. ఆయన టైమింగ్ లో ఎలాంటి మార్పు ఉండకూడదు. ఇంకా మరింత ఎనర్జీతో ఆయన కెరీర్ కొనసాగించాలని కోరుకుంటున్నా. అన్నారు.

కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ – నేను జర్నలిస్ట్ గా కెరీర్ ప్రారంభించా. పీఆర్‌ఓగా పనిచేశా. పాత్రికేయ మిత్రుల్లో ఒకరిగా మీ స్నేహాన్ని పొందా. ఇప్పుడు ప్రొడ్యూసర్ గా ఈ వేదిక మీద నిలబడ్డా. ఈ జర్నీలో ప్రతి సందర్భంలో జర్నలిస్ట్ మిత్రులు నా తోడుగా ఉన్నారు. మీరు లేకుండా నా సక్సెస్ లేదు. బేబి కల్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్న మూడేళ్ల తర్వాత ఇప్పుడు చెన్నై లవ్ స్టోరీ అనే క్లాసిక్ బ్లాక్ బస్టర్ తో మీ ముందుకు రాబోతున్నాం. అన్నారు.

## బాక్సాఫీస్ కంటే పెద్ద పరీక్ష? 'లెనిన్'తో ముగ్గురి ఫ్యూచర్ డిసైడ్

సాధారణంగా ఒక సినిమా హిట్ అవ్వడం అనేది హీరోకో లేదా దర్శకుడికో ముఖ్యం అవుతుంది. కానీ 'లెనిన్' చిత్రం మాత్రం టాలీవుడ్‌లోని ముగ్గురు కీలక వ్యక్తుల భవిష్యత్తును, వారి క్రెడిబిలిటీని శాసించే ఒక అరుదైన మైలురాయిగా నిలిచింది. అక్కినేని అఖిల్, బ్యూటిఫుల్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే, మరియు క్రేజీ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ.. ఈ ముగ్గురికీ ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. జులై 10న థియేటర్లలోకి రాబోతున్న ఈ మూవీ అసలు ఎందుకు ఇంత స్పెషల్ అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. అఖిల్ అక్కినేని 'కంబ్యాక్' సవాల్: అక్కినేని యంగ్ హీరో అఖిల్‌కు 'లెనిన్' చిత్రంతో ఒక సాలిడ్ హిట్ కొట్టడం ఇప్పుడు అత్యంత అవసరంగా మారింది. తన కెరీర్ చుట్టూ సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌కు ఫుల్ స్టాప్ పెట్టాలన్నా, పదే పదే రీ- ఎంట్రీలంటూ వచ్చే కామెంట్స్‌కు గట్టి సమాధానం ఇవ్వాలన్నా ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వాల్సిందే. ఇక అన్నింటికీ మించి "అయ్యగారు ఈజ్ బ్యాక్" అంటూ కాలర్ ఎగరేసి గర్వంగా సెలబ్రేట్ చేసుకోవడానికి ఆయన అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే 'ఐరన్ లెగ్' ముద్ర చెరిగిపోవాలి: ఇక హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే విషయానికి వస్తే, ఆమె తన గత చిత్రాల్లో అద్భుతమైన నటన కనబరిచినప్పటికీ.. బాక్సాఫీస్ దగ్గర ఆ సినిమాలు దారుణంగా ఫెయిల్ అయ్యాయి. ఇక దీంతో కొందరు ఆమెను అన్‌లక్కీ చార్మ్ అని పిలవడం మొదలుపెట్టారు. అయినా కూడా ఆమెకు అవకాశాలు తగ్గకపోవడం విశేషం. ఇలాంటి టైంలో 'లెనిన్' రూపంలో ఆమెకు ఒక పెద్ద సక్సెస్ వస్తే, ఇండస్ట్రీలో ఆమె పొజిషన్ పూర్తిగా మారిపోవడం ఖాయం. నిర్మాత నాగవంశీకి నిజమైన అగ్నిపరీక్ష: ఈ సినిమా సక్సెస్ నిర్మాత నాగవంశీకి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు కూడా ఒక పెద్ద పరీక్షే. సంక్రాంతికి వచ్చిన 'అనగనగా ఒక రాజు' కాస్త ఊరటనిచ్చినా.. ఆ తర్వాత కొన్ని ఒడిదొడుకులు ఎదురయ్యాయి. ఇక అఖిల్ కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తెచ్చే బాధ్యతను నాగవంశీ తన భుజాలపై వేసుకున్నారు. అందుకే ఎక్కడా రాజీ పడకుండా, అవసరమైన చోట రీషూట్లు కూడా చేస్తూ చాలా జాగ్రత్తగా ఈ సినిమాను నిర్మించారు. సినిమా హిట్ అయితే ఆ క్రెడిట్ అంతా ఆయనకే దక్కుతుంది.



## వెయ్యి కోట్ల టార్గెట్ వైపు జైలర్2



: సినిమా రిలీజ్ కు ఇంకా టైమ్ ఉన్నప్పటికీ, ట్రేడ్ వర్గాల్లో ఇప్పటికే భారీ డిస్కషన్ కు కారణమవుతున్న ప్రాజెక్ట్‌గా జైలర్2 నిలుస్తోంది. మొదటి భాగం సాధించిన కమర్షియల్ సక్సెస్ తో పాటు, సీక్వెల్‌పై ఏర్పడిన అంచనాలు ఇప్పుడు ప్రీ రిలీజ్ బిజినెస్‌ను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్తున్నాయనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమవుతోంది. రిలీజ్ కు ముందే డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం వివిధ ఏరియాల నుంచి ఇంట్రెస్ట్ పెరగడం ఈ సినిమాపై ఉన్న మార్కెట్ నమ్మకాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ప్రత్యేకంగా కేరళ మార్కెట్‌లో జైలర్2కు అనూహ్యమైన డిమాండ్ కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం అక్కడ బెస్ట్ కలెక్షన్లు నమోదు చేయడంతో, జైలర్ రైట్స్ ను సొంతం చేసుకోవడానికి ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు పోటీపడుతున్నట్లు సమాచారం. అడ్వాన్స్ డీల్స్ విషయంలోనూ భారీ ఆఫర్లు వినిపిస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇది సినిమా రిలీజ్‌కు ముందే రికార్డు స్థాయి బిజినెస్‌కు సంకేతంగా భావిస్తున్నారు. దీనికి మరో ప్రధాన కారణంగా మల్టీస్టారర్ ఎట్రాక్షన్ ను ట్రేడ్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మోహన్‌లాల్ ప్రభావం కేరళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు. ఆయనకు ఉన్న అభిమాన వర్గం, రజినీకాంత్‌కు ఉన్న విశాలమైన మార్కెట్ కలిసి ఈ సినిమాను సౌత్‌లో అత్యంత క్రేజ్ ఉన్న ప్రాజెక్టుల లిస్టులో నిలబెడుతున్నాయి. రీసెంట్ గా రిలీజైన రిలీజ్ డేట్ గ్లింప్స్ కూడా సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో గ్లింప్స్‌కు వచ్చిన రెస్పాన్స్, ఫ్యాన్స్ డిస్కషన్స్, ట్రేడ్ వర్గాల్లో పెరిగిన ఆసక్తి కలిసి జైలర్2పై అంచనాలను మరింత బలపరిచాయి. సినిమా కంటెంట్‌కు సంబంధించిన వివరాలు పూర్తిగా బయటకు రాకముందే ఈ రేంజ్ బజ్ రావడం విశేషంగా చెప్పబడుతోంది.తెలుగు మార్కెట్‌లోనూ పరిస్థితి ఇదే విధంగా కనిపిస్తోంది. జైలర్ కు లభించిన ఆదరణ కారణంగా రెండో భాగం థియేట్రికల్ రైట్స్ పై కూడా మంచి ఆసక్తి నెలకొనే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ మార్కెట్లలో ఒకేసారి స్ట్రాంగ్ బిజినెస్‌ను టార్గెట్ గా పెట్టుకుని రిలీజ్ ప్లాన్స్ రూపొందుతున్నాయనే చర్చ సాగుతోంది. డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్, సూపర్ స్టార్ రజినీకాంత్ కాంబినేషన్ మరోసారి రిపీట్ కావడం కూడా ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన బలంగా మారింది. తొలి భాగంలో మాస్ ఎంటర్‌టైనర్‌ను అందించిన ఈ జోడీపై డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు గట్టి నమ్మకం ఉంచుతున్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రీ రిలీజ్ దశలోనే సినిమా బిజినెస్ ఊహించిన దానికంటే వేగంగా ముందుకు సాగుతోందని ట్రేడ్ వర్గాల అంచనా. టైమ్‌లో కృతి కీలక నిర్ణయం.. సరైన టైమ్ లో సరైన డెసిషన్! ఇప్పటికే ఇండస్ట్రీలో వినిపిస్తున్న డిస్కషన్స్ ప్రకారం, జైలర్2 కేవలం సీక్వెల్ మాత్రమే కాదు, పాన్ సౌత్ స్థాయిలో భారీ కమర్షియల్ ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. రిలీజ్‌కు ముందే కనిపిస్తున్న మార్కెట్ రెస్పాన్స్ చూస్తే, తొలి భాగం నెలకొల్పిన రికార్డులను అధిగమించే దిశగా ఈ సినిమా అడుగులేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే జోరు కంటిన్యూ అయితే రూ. 1000 కోట్ల క్లబ్‌ను టార్గెట్ గా పెట్టుకున్న సినిమాల్లో జైలర్2 కూడా ఒకటిగా నిలిచే అవకాశాలను ట్రేడ్ వర్గాలు కొట్టిపారేయడం లేదు.

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com